

మహా..ప్రసాదం

తాళ్లపూడి మండలం రావూరు పాడులో సోమవారం గణపతికి 108 రకాల ప్రసాదాలు నివేదన చేశారు. సాయంత్రం భక్తులకు పంపిణీ చేశారు. - తాళ్లపూడి



గణపతికి గోల్డెన్ టెంపుల్

చవితి ఉత్సవాల్లో భాగంగా కొవ్వూరు లాంచీల రేవు వద్ద నమూనా గోల్డెన్ టెంపుల్ కట్టి 12 అడుగుల గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. - కొవ్వూరు

గోదారి ఘాట్ల వద్ద దిగొద్దు
ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్



ధవళేశ్వరం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ సూచించారు. ఘాట్లవద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, పిల్లలు నదిలోకి దిగవద్దని హెచ్చరించారు. వరద ఉధృతి మరికొన్ని రోజులు ఉంటుందన్నారు.



రాజమహేంద్రవరంలో నిర్వహించిన సారథ్యం యాత్రలో బీజేపీ జెండాలతో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు



కార్డు..కష్టం!
ఆలోచన స్మార్ట్.. అమలులో నిర్లక్ష్యం
ఇంటింటికీ పంపిణీ లేదు - డీలర్ల వద్దకు వెళ్లలేక ఇక్కట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో అధికారులు చేసేదొకటి.. ఎక్కడా పొంతన ఉండడంలేదు.. సర్కారు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు.. స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ సిబ్బంది ఆగస్టు 25వ తేదీ నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తారని తొలుత ప్రకటించారు.అయితే అలా ఎక్కడా జరగలేదు.. ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ ఆరం భించారు.. ఆయా రేషన్ షాపులకు వెళ్లడానికి వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జనం ఇబ్బందులు పడుతు న్నారు. ఇంటి వద్దకే స్మార్టు కార్డులను తెచ్చి ఇస్తారని ప్రభుత్వం ప్రకటిం చింది. కానీ వాస్తవంలో తక్కువగా అమలు జరుగుతోంది. రేషన్ పోర్టబిలిటీ వెసులుబాటు వల్ల చాలా మంది ఎక్కడెక్కడో రేషన్ తీసుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం తమ కార్డు ఏ రేషన్ షాపునకు వెళ్లిందనేది అయోమ యంగా మారింది. తొలిసారిగా ఎక్కడైతే రేషన్ తీసుకున్నారో ఆ షాపునకు కార్డులు వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుపై చౌక ధరల దుకాణం నెంబరు ఉంటుంది. కాలక్రమేణా లబ్ధిదారులు నివాసాల మార్పు వల్ల స్మార్ట్ రేషన్ కార్డు చేతికి అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో స్మార్ట్ కార్డు పంపిణీ మొదలు పెట్టి వారం కావొస్తున్నా 40 శాతమే లబ్ధిదారులకు చేరాయి. అంటే ఇప్పటి వరకూ దాదాపు 2.25 లక్షల కార్డులు మాత్రమే లబ్ధిదారులకు చేరాయి. ఇంకా సుమారు 3.34 లక్షల కార్డులు చేరాల్సి ఉంది.ఈ నెల 15 వరకూ సమయం ఉండడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నా..ఈ రోజు తీసుకోకపోతే కార్డు వెనక్కి వెళ్లిపోతుందని క్షేత్రస్థాయి సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురై రేషన్ షాపుల వెతుకులాటలో విసుగుచెందుతున్నారు. జిల్లాలో 5.63 లక్షల రేషన్ కార్డులు ఉండగా 5.59 లక్షల స్మార్ట్ కార్డులు తొలి దశలో వచ్చాయి. రెండో దశలో మిగతావి రానున్నాయి. పింఛన్ ఇస్తున్నట్టే వీఆర్వోలు లేదా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్మార్ట్ కార్డులు అందజేయాలనే వాదన ఉంది.ఏదైనా రేషన్ షాపు దగ్గరకు వెళ్లి ఈ-పోస్ యంత్రంలో ప్రస్తుత కార్డు నెంబరు నమోదు చేస్తే స్మార్ట్ కార్డు ఏ షాపునకు వెళ్లిందనే వివరాలు ఉంటాయని జిల్లా పౌర సరఫరాల అధికారి పార్వతి చెప్పారు.

ఏటీఎం కార్డులా...

కూటమి ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్ రేషన్ కార్డులను తెచ్చింది.ఇది ఏటీఎం కార్డులా ఉంది. దీనిపై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కుటుంబీకుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ పరిమాణం, తీసుకున్న వివరాలు, డిపో చిరునామా వంటివి తెలుస్తాయి. రేషన్ తీసుకోగానే రాష్ట్ర, జిల్లా కార్యాలయాలకు చేరుతుంది. పక్కా లెక్కలు వస్తాయి. దీంతో అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.



ఎరువు..కరువు : సీతానగరం మండలం వంగలపూడి సొసైటీ వద్ద యూరియాకు రైతుల క్యూ.. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీ వద్ద రైతుల ఆందోళన



యూరియా క్యూ

అధికారులు కొరత లేదంటారు.. రైతులు చూస్తే కొరత అంటారు.. సొసైటీల వద్ద ప్రతి రోజూ పెద్ద ఎత్తున క్యూ లు కడుతున్నారు.. ఆయా మండలాలకు సరిపడా సరఫరా చేసిన యూరియా ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే యూరియా బాధలు తీరడం లేదు.. రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.. రైతులు రోజూ యూ రియాకు కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు.. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, గోకవరం మండలాల్లో పలు సొసైటీల వద్ద యూరియాకు పడిగాపులు కాశారు.. ఇక కోరుకొండలో అయితే రైతులు ఆందోళనకు దిగారు. అయినా అధికారులకు పట్టడంలేదు.

- జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత
- లబోదిబోమంటున్న రైతాంగం

కోరుకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. శ్రీరంగపట్నం సొసైటీ వద్ద రాఘవాపురం, బొల్లెద్దుపాలెం గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా అందడం లేదని ఆందోళనకు దిగారు. శ్రీరంగపట్నం సొసైటీకి ఇప్పటికే 182 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చారు. శ్రీరంగపట్నం, కోటి గ్రామాలకు ఆదివారం మరో 10 టన్నుల చొప్పున యూరియా అధికారులు సరఫరా చేశారు. అయితే తమకు ఎరువులు అందడం లేదని శ్రీరంగపట్నం సొసైటీ పరిధిలోని రాఘవాపురం, బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేశారు. దీంతో సోమవారం శ్రీరంగపట్నంలో ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. మండల వ్యవసాయాధికారులు, పోలీసులు శ్రీరంగపట్నం సొసైటీకి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. మండల వ్యవసాయాధికారి జిల్లా వ్యవసాయాధికారితో మాట్లాడి రాఘవాపురం గ్రామానికి 20 టన్నుల యూరియాను పంపే ఏర్పాటు చేయడంతో రైతులు శాంతించారు.రాఘవాపురం గ్రామానికి 100 బస్తాలు, బొల్లెదుపాలెం గ్రామానికి 100 బస్తాలుచొప్పున ఇచ్చామన్నారు. శ్రీరంగపట్నం సొసైటీ వద్ద 350 బస్తాల యూరియాను మంగళవారం రైతులకు అందజేస్తామన్నారు. కోటి గ్రామంలో 225 బస్తాలు రైతులకు అందించే ఏర్పాట్లు చేశారు. కోరుకొండ సొసైటీకి ఆదివారం సాయంత్రం వచ్చిన 20 టన్నుల యూరియాను సోమవారం పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున అందజేశారు.కోరుకొండ సొసైటీ పరిధిలో 10 గ్రామాల్లో 5 వేల మంది రైతులున్నారు. శనివారం 115, సోమవారం 225 మంది రైతులకు 30 టన్నుల యూరియా అందజేశారు.సొసైటీ పరిధిలో సుమారు 2500 మంది రైతులు యూరియాకు ఎదురుచూస్తున్నారు.

పొంతనలేని అధికారుల లెక్కలు..

గోకవరం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరతే లేదంటూ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులు పదేపదే ప్రకటనలు చేస్తు న్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. యూరియా కోసం రైతన్నలు తిండి, తిప్పలు మాని సొసైటీల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ముందు ఎవరు ఉంటే వారికే యూరియా దక్కుతుందనే ఆశతో సొసైటీల వద్దకు ఉదయాన్నే చేరుకుంటున్నారు. ఆ తరువాత వారి అదృష్టాన్ని బట్టి యూరియా లభిస్తోంది. గోకవరం సొసైటీ వద్దకు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది రైతులు పడిగాపులు కాశారు. పోలీసుల పర్యవేక్షణలో సిబ్బంది ఇచ్చినంత యూరియా తీసుకొని ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి అయినప్పటికీ సొసైటీ అధికారులు వచ్చిన రైతులందరికీ యూరియా ఇచ్చారు.

ఆధార్‌కార్డుపై.. ఒకే ఒక బస్తా..

సీతానగరం,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కష్టాలు తొలగడం లేదు. ఆధార్ కార్డుపై ఒకే ఒక్క యూరియా బస్తా ఇస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎకరాకు 3 బస్తాలు అవసరం కావ డంతో సొసైటీల వద్ద క్యూ కడుతున్నారు.సోమవారం వంగలపూడి సొసైటీ వద్ద పెద్ద ఎత్తున క్యూకట్టారు. పలువురు రైతులకు యూరియా అందలేదు. దీనిపై ఏవో గౌరిదేవిని ప్రశ్నించగా వాస్తవంగా రైతులు యూరియాను అదనంగా వాడేశారన్నారు. సీతానగరం మండలానికి 900 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే 1818 మెట్రిక్ టన్నులు వాడారన్నారు.మంగళవారం మరికొంత యూరియా మండలానికొచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

రెండేళ్లలో పోలవరం

- ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లిచ్చాం
- బీజేపీ పటిష్టానికి చర్యలు
- త్వరలో మన పార్టీ - మన జెండా
- కుంభమేళా తరహాలో పుష్కరాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. వచ్చే రెండేళ్లలో పోలవరం ఎడమకాలువ ద్వారా నీళ్ల ప్రవహించేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు.రాజమహేంద్రవరంలో సోమవారం చాయ్ పే చర్చ, సారథ్యం యాత్ర, బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీని గ్రామస్థాయిలో పటిష్టం చేయడానికి "మన పార్టీ మన జెండా" పేరుతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. వైసీపీ హయాంలో పోలవరం పనులు నత్తనడకన జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్లు ఇచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయన్నారు. కూటమిలో సముచిత స్థానం లభించడంలేదని కొంతమందిలో అసంతృప్తి ఉన్నమాట వాస్తవమే అయినా మూడు పార్టీలకు సమన్యాయం చేస్తూ పదవులు లభిస్తున్నాయనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కుంభమేళా తరహాలో రాజమహేంద్రవరం పుష్కరాలను ఘనంగా నిర్వహించాలనే ఆలోచన జరుగుతున్నదన్నారు. రాజమహేంద్రవరం తనకు అత్యంత ఇష్టమైన ప్రాంతం అన్నారు. మహనీయుడు కందుకూరి వీరేశలింగం నడయాడిన రాజమహేంద్రవరం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 19 జిల్లాల్లో సారథ్యం యాత్ర ముగిసిందని, 20వ జిల్లా తూర్పుగోదావరి అన్నారు. రాజకీయ క్షేత్రం అంటేనే బురదమయం అన్నారు. దేవుడి దర్శనానికి వెళ్లాలంటే డబ్బులు ఇవ్వాల్సి రావడం బాధగానే ఉందన్నారు. అయోధ్య రామాలయంలో దర్శనం, ప్రసాదాల విషయంలో ఆదర్శవంతమైన వ్యవస్థ నిర్మాణమైంది. అలాంటి వ్యవస్థ అన్ని చోట్లా జరగాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ ప్రస్థానంలో కార్యకర్తల భాగస్వామ్యం ప్రధానమైందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత బీజేపీ కార్యకర్తలకే దక్కుతుందని అన్నారు. మోదీ తల్లి గురించి రాహుల్‌గాంధీ మాట్లాడిన తీరు దారుణమని, సంస్కారం లేకుండా చేస్తున్న ఇలాంటి విమర్శలను తిప్పికొట్టాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని..రాష్ట్రానికి అవసరమైన సహకారం అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ దిశ, దశ మార్చే శక్తియుక్తులు మాధవ్‌లో ఉన్నాయన్నారు. ముందుగా వై.జంక్షన్ నుంచి దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానం వరకూ పాదయాత్రగా ర్యాలీ చేశారు.ఆయన వెంట బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, దయాకర్‌రెడ్డి, పరిమి రాధ, నర్సిపల్లి హారిక, కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి శ్రీనివాస్,క్రెడాయ్ ఏపీ చైర్మన్ శ్రీనివాస్,షేక్ సుభాన్ ఉన్నారు.



కొంతమూరులో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ప్రభుత్వ సలహాదారు షరీఫ్

తొలిరోజే 93 శాతం పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో జోరు కనబడింది. ఉదయం నుంచి మొదలు పెట్టి సుమారు 4వేల మంది సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. 2,35,813 మంది లబ్ధిదారులకు 2,19,792 మంది చేతికి రూ.95 కోట్ల 52 లక్షల 59 వేల 500 పింఛను రూపేణా అందించారు. రాత్రి 8 గంటల సమయానికి 93.21 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మండలాల విషయానికొస్తే మొదటి మూడు స్థానాల్లో వరుసగా రాజమహేంద్రవరం అర్బన్, నిడదవోలు అర్బన్, గోపాలపురం నిలిచాయి. రాష్ట్రంలో తూర్పు గోదావరి ఏడో స్థానంలో నిలిచినట్టు డీఆర్డీఏ పీడీ మూర్తి వెల్లడించారు.

ప్రభుత్వ వైద్య సేవల్లో జిల్లాకు 3వ స్థానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తాజా ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సర్వేలో ప్రభుత్వ ఆరోగ్యసేవలపై తూర్పుగోదావరి జిల్లా 3వ స్థానం సాధించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వైద్యాధికారులతో సమీక్షలు జరపడం వల్ల ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. జిల్లాకు 3వ ర్యాంకు లభించడం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న వైద్యసేవలకు నిదర్శనమన్నారు.



రియల్..ఛాన్స్!
అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకో అవకాశం

తక్కువ ధరకు భూమి వస్తుందని ప్లాటైపోతారు.. పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేస్తారు.. తీరా ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు రావు.. అప్పుడు ఆరా తీస్తే అనధికార లేఅవుట్ అని తేలుతుంది.. ఎంత ప్రయత్నించినా అనుమతులు రాక లబోదిబోమంటారు.. అటువంటి ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఒక అవకాశం ఇచ్చింది.. అదే ఎల్ఆర్ఎస్.. ఈ స్కీమ్‌లో కొంత మొత్తం చెల్లించి ప్లాట్ క్రమబద్ధీకరించుకోవచ్చు. మరికెందుకు ఆలస్యం..రియల్ ఛాన్స్ ఉపయోగించుకోండి.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

తెలిసో..తెలియకో అనధికార లేఅవుట్లలో రూ.లక్షలు పోసి ప్లాట్లు కొనుగోలు చేస్తారు.. ఆ ప్లాట్లలో ఏమైనా నిర్మాణాలు చేద్దామంటే అనుమతులు లభించవు. దీంతో వేలాది మంది ఇబ్బంది పడుతుంటారు. ఇలా సతమతమవుతున్న వారికి ప్రభుత్వం ఒక అవకాశం ఇచ్చింది. అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) స్కీమ్‌ను ముందుకు తెచ్చింది. ఈ మేరకు జూలై 26వ తేదీన జీవో జారీ చేసింది. 90 రోజుల్లో ఈ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలనే నిబంధన ఉంది. ఇప్పటికే నెలరోజులైంది. ఇక సుమారు రెండు నెలల్లోపే గడువు ఉంది. అయితే స్పందన అంతగా లేకపోవడంతో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు.గత జూన్ 30లోపు అనధికార లేఅవుట్లు, ప్లాట్లుగా ఉన్నవాటికి ఈ స్కీమ్ వర్తిస్తుంది.

అనధికార ప్లాట్లు అంటే..?

ప్రభుత్వం నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా ఏదైనా భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేస్తారు. సాధారణంగా లేఅవుట్ వేయాలంటే 10 శాతం కామ న్ సైట్ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే ఎకరం లేఅవుట్ వేస్తే దానిలో 10 సెంట్లు కామన్ సైట్‌గా వదిలే యా లి. రోడ్లు నిబంధనలకు తగినట్టు ఏర్పాటు చేయాలి. లేఅవుట్ వేయడానికి ముందు పొలానికి కన్వర్షన్ ఫీజు చెల్లించాలి. ఆ తరువాత నిబంధనల మేరకు లేఅవుట్ విభజించి డీటీసీపీ అనుమతులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ తతంగం అంతా చేస్తేనే అది లేఅవుట్ లెక్కలోకి వస్తుంది. ఈ వ్యవహారం అంతా ఖర్చుతో కూడుకున్న పనికావడంతో రాజకీయ పలుకుబడి ఉన్న రియల్టర్లు కనీస అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేసేస్తారు. వీటినే అనధికార లేఅవుట్లు అంటారు. ఈ లేఅవుట్‌లో ప్లాట్ తీసుకుంటే పంచాయతీ అయినా.. పట్టణంలో అయినా భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వరు. ఆ లేవుట్‌లో మౌలిక వసతులపై దృష్టి పెట్టరు. దీంతో భూమి తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేసినా ఆ తరువాత చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

రుడాలో 300పైనే అనధికారం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో 390 గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో గతంలో ఆన్‌లైన్‌లో సేకరించిన వివరాల ప్రకారం 300పైనే అనధికార లేఅవుట్లు ఉన్నాయి. వాటి సంఖ్యను వాస్తవంగా సేకరించే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు.ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులను అనధికార లేఅవుట్ల వివ రాలు ఇవ్వాలని ఆదేశించారు. వాస్తవానికి 2020లో ఎల్ఆర్ఎస్ జీవో వచ్చింది. 2019 ఆగస్టు 31వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్లకు అది వర్తించేలా జీవో ఇచ్చారు.కానీ అప్పటికి సుమారు 3 వేల దరఖాస్తులు వచ్చాయి.అవన్నీ పరిష్కారం కాలేదు. క్రమంగా 2వేల దరఖాస్తులు పరిష్కరించారు. మరో 1000 వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు 2025 జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ చేసుకున్న అనధికార ప్లాట్లకు వర్తించేలా జూలై 26న ప్రభుత్వం జీవో ఇచ్చింది. 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది.స్కీమ్ గ్రామాలు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తిస్తుంది.

ఏ ప్లాట్‌కు ఎంత?

అనధికార లేఅవుట్‌లో కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎవరికి వారు ఎల్ఆర్ఎస్ స్కీమ్ వర్తింపచేసుకో వ చ్చు. మొత్తం లేఅవుట్ క్రమబద్ధీకరించుకోవచ్చు. సాధారణంగా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత లేఅవుట్ యజమాని అందుబాటులో ఉండడు. అందువల్ల కొనుగోలు దారులే చేయించుకోవాల్సి ఉంటుంది. ప్లాట్ ఏరియాను బట్టి పీనలైజేషన్ చార్జీలు నిర్ణయించారు. 100 చదరపు మీటర్ల వరకూ ఒక చదరపు మీటరు చార్జీ రూ.200 చెల్లించాలి. 100 నుంచి 300 చదరపు మీటర్ల వరకూ ఉంటే ఒక్కో చదరపు మీటరుకు రూ.400 చెల్లించాలి. 300 నుంచి 500 చ.మీ వరకూ ఉంటే ఒక్కో చ.మీ.కీ రూ.600 చెల్లించాలి. 500 చ.మీ దాటి ఉంటే ఒక్కో చ.మీ.కి రూ.750 చెల్లించాలి.ఈ చార్జీలన్నీ గత జూన్ 30వతేదీలోపు ఆయా ప్రాంతాల్లో ఉన్న భూమి మార్కెట్ విలువను బట్టి వర్తిస్తుంది. 3 వేల లోపు చదరపు గజాలకు 20 శాతం, 3 వేల నుంచి 5వేల లోపు వాటికి 30 శాతం, 5001 నుంచి 10 వేల లోపు వాటికి 40 శాతం, 10001 నుంచి 20 వేల వరకూ 50 శాతం, 20001 నుంచి 30 వేల వరకూ 60 శాతం, 30,001 నుంచి 50 వేల వరకూ 80 శాతం, 50 వేల చదరపు గజాలు ఉంటే 100 శాతం పీనలైజేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.ఆ..లేఅవుట్‌లో ఓపెన్ సైట్ (కామన్‌సైట్) లేకపోతే ప్లాట్ విలువులో 14 శాతం చెల్లించాల్సి ఉంది. అనధికార లేఅవుట్లలో ప్లాట్ కొనుగోలు చేసిన యజమానులు నష్టపోవాల్సి వస్తుంది.అనధికార లేఅవుట్ యజమానిపై చర్యలేమీ ఉండవు.అతడు ప్లాట్లన్నీ అమ్మేసుకుని డబ్బు చేసు కుంటాడు.ఇవి క్రమబ ద్ధీకరించుకోవడానికి అవసరమైన డబ్బంతా ప్లాట్ల యజమానులే భరించాలి. అందుకే ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో అనధికార ప్లాట్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది.

- రుడా పరిధిలో 300పైనే లేఅవుట్లు
- తక్కువ ధరకు స్థలాల కొనుగోళ్లు
- నాన్‌లేఅవుట్లని తెలిశాక లబోదిబో
- అందుబాటులోకి ఎల్ఆర్ఎస్ స్కీమ్
- మరో 2 నెలల వరకూ అవకాశం
- జూన్30లోపు లేఅవుట్లకే వర్తింపు



తీపి.. గణేశుడు



ధవళేశ్వరం బస్టాండ్ వద్ద 1500 కేజీల అనకాపల్లి బెల్లం కుందెలతో విశాఖపట్నంలో తయారు చేసిన 12 అడుగుల గణేశుడిని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని ధవళేశ్వరం తరలించడానికి సుమారు రూ.1.80 లక్షలు ఖర్చయినట్టు విఘ్నేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు అప్పన్న తెలిపారు. - ధవళేశ్వరం

ఐడియాకో దండం!

కోనసీమ అంటే కొబ్బరికి ప్రసిద్ధి.. కొబ్బరితో ఏమేం చేయవచ్చో కోనసీమవాసులకు తెలిసినంతగ మరికెవరికీ తెలియదు.. ఈ సంఘటనే ఉదాహరణ.. పువ్వుల ధరలు మండిపోతున్నాయి.. దండ కొనుగోలు చేయాలంటే రూ.200పైనే ఉంటుంది.. అందుకే అంతర్వేదికి చెందిన పున్నం నాగేంద్ర, చిక్కాల సాయి కొబ్బరి ఆకులతో దండలు చేసి వినాయకులకు వేశారు.. భలేగుంది కదూ ఐడియా.. - అంతర్వేది

మూషిక వాహన గణేశా!



అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి లక్ష దూర్వార్చన, ప్రత్యేకాలంకరణ, పంచ హారతులు నిర్వహించారు. చవితి మహోత్సవాల్లో ఆరో రోజు శక్తి గణపతి అలంకారుడై మూషిక వాహనంపై స్వామివారిని మాడవీధి సేవ నిర్వహించారు. - అయినవిల్లి



ఘన.. పయ్యి!

పి.గన్నవరంలో ఆటోపై మండపం కట్టి గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భారత్ ఆటో యూనియన్ సభ్యులు

కల్పవృక్షం.. కొబ్బరిచెట్టు



కొబ్బరి పేరు చెప్పగానే మనందరకీ గుర్తొచ్చేది కోనసీమ. ఎటుచూసినా పైరు పచ్చని వరి చేలు.. కల్పవృక్షాల్లాంటి కొబ్బరిచెట్లు.. వాటికి నలుదిక్కులా కొబ్బరి గెలలతో కొబ్బరి చెట్లు కనువిందు చేస్తాయి. సూర్యరశ్మిని సైతం నేల పైకి పడకుండా గొడుగు మాదిరిగా ఉంటూ సూర్యకిరణాలు కొద్దిగా నేలపై పడుతూ కనిపించే దృశ్యాలు కోకొల్లలు. కోనసీమ రైతుల బతుకు బండి కొబ్బరి పంటపైనే ఆధారపడి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉండడంతో కోనసీమకు కొబ్బరిసీమ అని పేరు వినిపిస్తుంటుంది. కొబ్బరి చెట్ల అందాలను తమ కెమేరాల్లో బంధించేందుకు తహతహలాడుతున్నారు ఫొటోగ్రాఫర్లు, సినీ దర్శకులు. అందుకే చాలా సినిమాల్లో కోనసీమ కొబ్బరి అందాలు వర్ణిస్తూ ఎన్నో సినిమాలను కూడా చిత్రీకరించారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

» రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు
» నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కొబ్బరి దినోత్సవం ఇలా మొదలైంది..

అంబాజీపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా సెప్టెంబరు 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రపంచంలో కొబ్బరికాయల సాగులో మొదటిస్థానంలోఉన్న ఇండోనేషియా వ్యవస్థాపక దినోత్సవం ఇదేరోజున. ఆ దేశాన్ని గౌరవిస్తూ కోకోనట్ డేను ఈరోజు నిర్వహిస్తుంటారు. మనదేశానికి కూడా ఆ సంఘంలో సభ్యత్వం కావడం.. మనకూ కొబ్బరి మీదే ఓ రాష్ట్రం ఉండడం.. మనరాష్ట్రంలో కోనసీమంతా కొబ్బరి పరిమళాన్ని వెదజల్లడంతో ఆ దినోత్సవం ఇక్కడా ప్రత్యేకమైపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొబ్బరిసాగు రైతుల సమక్షంలో కొబ్బరికాయల వాడకం ప్రాముఖ్యంపై ప్రజలకు తెలియచేయడం, కృత్రిమ శీతల పానీయాల కంటే కొన్ని రెట్లు మెరుగైన సహజసిద్ధమైన కొబ్బరినీళ్ల తాగడంలో ప్రయోజనాలు వివరించడం, కొబ్బరి పరిశ్రమలో పెట్టుబడులను ప్రోత్సహించడం వంటివి కోకోనట్ డే ప్రధాన లక్ష్యం.

కోనసీమ కొబ్బరి..

తెలుగువారికి కొబ్బరిఅనగానే కోనసీమ గుర్తుకు వస్తుంది. ఉభయగోదావరి జిల్లాలు విరివిగా కొబ్బరిపండిస్తే తూర్పుగోదావరి జిల్లానే మొత్తం రాష్ట్ర పంటలో సగం వరకూ ఉంది. అందులోనూ ఎక్కువ వాటా కోనసీమదే.నేల నాణ్యత, అధికతేమ, వర్షపాతం వంటి అంశాలు కోనసీమలో కొబ్బరిసాగుకు ఎంతగానో తోడ్పడతాయి. ఇక్కడి కొబ్బరి రైతులు కొబ్బరి చెట్లతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. వాటిని తమ కుటుంబసభ్యుల్లా చూసుకుంటారు. నిజానికి ఒక కొబ్బరి చెట్టు కొడుకుతో సమానమని చెప్పుకొంటారు. అంటే ఒక కొబ్బరిచెట్టు ఉంటే కుటుంబాన్ని సునాయాసంగా వెళ్లదీయవచ్చునని భావం. ఇప్పుడు ఉభయగోదావరి జిల్లాల్లో కొబ్బరి సాగు తగ్గుతోంది. ప్రభుత్వపరంగా సరైన ప్రోత్సాహం



లేక రైతులు నిరుత్సాహపడుతున్నారు. ఎకరానికి 10వేల కాయలు కాయించే కోనసీమ కొబ్బరి పంటను ఆధారం చేసుకుని విశేష నైపుణ్యాలు అభివృద్ధిఅయ్యాయి. కొబ్బరిచెట్లు ఎక్కేవాళ్ల, కాయలను ఒలిచే వాళ్లవంటి ప్రత్యేకమైన పనివాళ్లు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నారు.

కోనసీమదే అగ్రభాగం

కొబ్బరి పండించే దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు ముఖ్యమైనవి. వీటిలో ఆంధ్రప్రదేశ్ విషయానికి వచ్చేసరికి కోనసీమలోని అంబాజీపేటదే అగ్రభాగం. కేరళ అలెప్పి తర్వాత అంబాజీపేటదే అగ్రస్థానం. 1.25లక్షల హెక్టార్లలో కొబ్బరి పంట ఇక్కడ సాగవుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల నెల జీతం మాదిరిగా కొబ్బరి రైతులకు ఆదాయం సమకూరుతుంది. అందుకే ఈ పంట అంటే ఇక్కడి రైతులకు అమితమైన అభిమానం. జీవిత చరమాంకంలో ఉన్న వారు కన్న కొడుకు కంటే కొబ్బరి చెట్టునే ఎక్కువ ప్రేమిస్తాడు.. ఆరాధిస్తాడు.

కొబ్బరి చెట్టుకు ప్రత్యేక స్థానం

కొబ్బరిచెట్టు నిజంగానే కల్పవృక్ష సమానం. మన జీవనంలో కొబ్బరిచెట్టుకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. పచ్చికొబ్బరి నుంచి ఎండు కొబ్బరి వరకూ అనేక రకాలుగా కొబ్బరిని వంటల్లో వాడడం, కొబ్బరినూనె, కొబ్బరినీరు దివ్య ఔషధాలుగా వాడుతుంటారు. కొబ్బరి పీచుతో కార్పెట్లు, క్వాయర్ వరుషలు, తాళ్లు తయారు చేస్తారు. కొబ్బరి మట్టలు, వంట చెరకుగా ఉపయోగిస్తారు. కొబ్బరి ఆకు ఈనెలతో చీపుర్లు తయారు చేస్తారు. ఇటీవల పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రకాల ఆకృతులను తయారు చేసి వాటిని పెళ్లి మండపాలు, పందిర్లలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా ధరలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కొబ్బరి ధరలు పుంజుకున్నాయి. పచ్చికాయల ధరలకు రెక్కలు రావడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయల ధరలు రూ.22వేల పైబడి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.10వేలనుంచి అమాంతంగా రూ.22వేలకుపైబడి ధరలు పెరగడంతో రైతులు కొబ్బరితోటల వైపు దృష్టిసారించారు.

కొబ్బరి వల్ల ఉపయోగాలు

- కొబ్బరి గుజ్జులో 46శాతం తేమ, 37శాతం కొవ్వు, మిగతా శాతం లవణాలు, ప్రొటీన్లు, ఉంటాయి.
- కొబ్బరి ప్రొటీన్లలో అధికశాతం అమినోయాసిడ్లు ఉన్నాయి.
- ఎండు కొబ్బరి నుంచి తీసిన కొబ్బరి నూనెలోని కీటోన్, లాక్టోన్ ఆల్కాహాల్ వల్ల ఆ నూనెకు ప్రత్యేక వాసన వస్తుంది.
- ఆరోగ్యపరంగా నట్స్‌తో పోలిస్తే కొబ్బరిలో సంతృప్తికరమైన కొవ్వులు ఎక్కువ. అందులో ఆరోగ్యానికి మేలుచేసే లారిక్ ఆమ్లం చాలా ఎక్కువ. ఇది మోనోలారిన్ మారి అంటువ్యాధులు రాకుండా అడ్డుకుటుంది.
- లాక్టోజ్ పడని చిన్నారులు, గర్భిణులకు కొబ్బరినీళ్లు, కొబ్బరిని రుబ్బి తీసిన పాలను తీసి ఇస్తే గ్లూకోజ్‌లా పనిచేస్తుంది.
- కొబ్బరి నీరు శరీరాన్ని చల్లబరచడమే కాకుండా జీర్ణక్రియకు సంబంధించి సమస్యలను నివారిస్తుంది. అతిసార వ్యాధి బాధితులు ఆ సమస్యల నుంచి బయటపడేందుకు కొబ్బరి నీటిని తీసుకొంటే మంచిదని వైద్యులు చెప్తున్నారు.
- మూత్ర పిండాలు, మూత్ర నాళాల్లో ఏర్పడే రాళ్లను కరిగించే గుణం కొబ్బరినీట్లో ఉంది.
- మామూలుగా కొబ్బరినూనె ఎండబెట్టిన కొబ్బరి నుంచి తీస్తారు. పచ్చికొబ్బరి నుంచి నూనె తీయవచ్చు.

రూ.లక్ష దాటి పరుగులు!

» 10గ్రాముల 24క్యారెట్ ధర రూ.1,05,870
» ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ ధర రూ. 97,050

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



బంగారంధరలు పైపైకి ఎగసిపోతున్నాయి. గతనెల వరలక్ష్మీవ్రతం రోజున బంగారం ధర భారీగా పెరిగిందనుకుంటే, ఇవాళ ఆ రికార్డులు బద్దలు కొట్టి, మరింత గా ధరలు పెరిగాయి. ఇప్పటికే బంగారం కొనుగోలు చేసినవారికి అది మంచి పెట్టు బడి వస్తువుగావారింది. సామాన్యులు మాత్రం నిరాశకు గురవుతున్నారు. సోమవారం రికార్డుస్థాయిలో బంగారం ధరలు పెరిగాయి. శని, ఆదివారాల్లో రాజమండ్రి మార్కెట్‌లో 22క్యారెట్ 10గ్రాముల బంగారం ధర రూ.96వేల 200గా ఉంది. సోమవారం ఈ ధర రూ.97,050కు చేరింది. ఏకంగా ఒక్కరోజులో రూ.850 పెరిగింది. ఇంకా రూ.3వేలు పెరిగితే రూ.లక్ష అయిపోతుంది. ఇక 24 క్యారెట్ బంగారం 10గ్రాముల ధర లక్ష ఎప్పుడో దాటేసింది. ప్రస్తుతం లక్షా5వేల 870గా ఉంది. వెండి ధర కూడా లక్షకు పైగా దాటేసి పరుగులు తీస్తోంది. కిలో వెండి ధర రూ.లక్షా 26వేల300గా ఉంది.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని

కాకినాడ జిల్లాలో కలపాలి

● కాకినాడ జిల్లా జేసీకి వినతి పత్రం అందజేసిన ఎంపీపీలు, సర్పంచ్‌లు



రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని అతి దగ్గరలోఉన్న కాకినాడజిల్లాలో కలపాలని ఆ నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకినాడ కలెక్టరేట్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ భౌగోళికంగా పరిశీలిస్తే రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడజిల్లాకు అతి సమీపంలో ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో ఉన్న కాజులూరు మండలాన్ని కాకినాడజిల్లాలో విలీనమైందన్నారు. ఈనేపథ్యంలో మిగిలిన రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రామచంద్రపురానికి అతిదూరంలో ఉన్న కోనసీమజిల్లాలో దీన్ని కలపడంవలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చిన్నపనికి అమలాపురం వెళ్లడం ప్రజలకు కష్టంగా ఉందన్నారు. ఈనేపథ్యంలో ప్రజల అభీష్టంమేరకు రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని కోరారు. కాకినాడ కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు.

కోనసీమ కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీలు, కౌన్సిలర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని సోమవారం రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన ఎంపీపీలు, రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిలర్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు ఇప్పటికే కాకినాడ జిల్లాలో ఉందని, రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలు గోదావరికి ఇవతల ఉన్నందున, భౌగోళికంగా దూరంగా మారినందున రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలతో కలిసి మొత్తంగా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని పేర్కొన్నారు. రామచంద్రపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా మద్దతు పలుకుతూ సంతకాలుచేసిన పత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అంబటి భవాని, గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, కట్టా గోవిందు, శ్రీను, బాలసుబ్రహ్మణ్యం, సత్యానందం, సూరిబాబు, శ్రీనివాస్, రాంబాబు, గోపాలకృష్ణ, వెంకట్రావు, దొరబాబు, బీఎస్పీ కాకినాడజిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాసిక్ నుంచి యానాం వరకు పాదయాత్ర

ఎటపాక, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోదావరినదీ పుట్టిన నాసిక్(త్రయంబకం) ప్రాంతం నుంచి యానాం వరకు భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తుల పాదయాత్ర సోమవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామం వరకు చేరుకుంది. నాసిక్‌లోని గంగోత్రి ఆశ్రమంకు చెందిన భక్తులు గోదావరి నదీ ప్రాంతాల సందర్శన కోసం యాత్ర నిర్వహించారు. అయితే ఆగస్టు 3న నాసిక్ నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు .అయితే వీరి పాదయాత్ర 3నెలల పాటు సాగనుంది. సుమారు పదిమంది భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పాదయాత్రగా సాగుతున్నారు.



నాసిక్ నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తులు

ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు

● ప్రభుత్వ సలహాదారు షరీఫ్

రాజమహేంద్రవరం/సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉర్దూభాషలో బోధన అందించడానికి ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని ప్రభుత్వ సలహాదారు(మైనార్టీ వ్యవహారాలు) ఎంఏ.షరీఫ్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కొంతమూరు సమీపంలోని ప్రాథమిక, జడ్పీఉన్నత పాఠశాల, లక్ష్మీ వారపుపేటలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఉర్దూ విద్యాభివృద్ధికి తొలి నుంచీ సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 12 ఉర్దూ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లీషు మీడియంలో బోధనను అందుబాటులోకి తెచ్చి ప్రాథమికస్థాయి నుంచి జూనియర్ కళాశాల వరకూ ఉర్దూ నేర్చుకొనే విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకటో తరగతిలో కనీసం 10మంది, పాఠశాలలో మొత్తం 40 మందికిపైగా విద్యార్థులు ఉన్నచోట ప్రత్యేక ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చూస్తామన్నారు. ఇది ప్రభుత్వ పాలసీలో ఒక భాగమని చెప్పారు. ఉర్దూ విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం, మాతృభాషలో బోధన అందించే ఉపాధ్యాయుల నియామకం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒక భాగమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉర్దూ బోధనా విషయంలో మైనార్టీల సమస్య తన దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కొంతమూరు ప్రాంతంలో వేలాదిగా ముస్లిం కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎలిమెంటరీ పాఠశాలలో 180 మంది, హైస్కూల్‌లో 134 మంది విద్యార్థులు చదువుతున్నా ఉర్దూ లేకపోవడం సమస్యగా ఉందని చెప్పారు. సర్వశిక్ష అభియాన్‌ద్వారా ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమలలో డీఈవో వాసుదేవరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, మైనార్టీ నాయకులు షేక్ సుభాన్, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, సొసైటీ చైర్మన్ అద్దాల శ్రీను, డైరెక్టర్ యమన నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా చెవ్వూరి



చెవ్వూరి రవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడరూరల్,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెవ్వూరి రవి ఎన్నికయ్యారు. విజయవాడలోని లయోలా కళాశాలవద్ద గల ఎస్‌జే సెంటర్లో నిర్వహించిన సంఘ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చెవ్వూరి అధ్యక్షుడిగానూ, గుంటూరు జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగానూ, అనంతపురం జిల్లాకు చెందిన కేవీభాస్కర్ కోశాధికారిగానూ, కర్నూలుకు చెందిన ఓంకార్ యాదవ్ గౌరవాధ్యక్షుడిగానూ ఎన్నికకాగా అధ్యక్షుడిగా ఎన్నికైన చెవ్వూరి రవిని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ఎదుర్కొంటున్న కామన్ సీనియారిటీ సమస్య, క్లస్టర్ పాఠశాలలకు గ్రేడ్1 ప్రధానోపాధ్యాయుల నియామకం, ఆర్థిక సంబంధమైన సమస్యల సత్వరపరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘ సభ్యులు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్టు

జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

●13, 14 తేదీలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

మండపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీలకు సంబంధించిన జట్టును ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. మండపేట- ఏడిద రోడ్డులోవున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్ ఉమ్మడిజిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ క్రీడా పోటీల ఎంపికకోసం 150మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. వచ్చిన వారిలో 24 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. హెచ్ఎం ముంగర వెంకట్రాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు గెడా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో టెన్నికాయిట్ పోటీలను మండపేటలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 13,14 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు 200మంది క్రీడాకారులు హాజరవుతారని వారు చెప్పారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అప్పాని కృష్ణకుమారి మాట్లాడుతూ మండపేటలో జరిగే పోటీలకు క్రీడాభిమానులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు వైద్య పరీక్షలు

కాకినాడక్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన 649 మంది అభ్యర్థులకు ఈనెల 2వ తేదీ నుంచి 8వరకు ఆరురోజులపాటు కాకినాడ జీజీహెచ్‌లో ఫిట్‌నెస్ రీత్యా వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విధిగా ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల కేటగిరీలకు అనుగుణంగా, వారి రిజిస్ట్రేషన్ నెంబర్లను బట్టి ఆయా తేదీల్లో హాజరుకావాలని పేర్కొన్నారు. 2న రిజిస్ట్రేషన్ నెంబర్ 4003237 నుంచి 4126868 వరకు జరుగుతాయి. అలాగే 3వ తేదీన 4127974 నుంచి 4251533 వరకు, 4న 4254521 నుంచి 4493328 వరకు, 5న 4001955 నుంచి 4321734 వరకు, అలాగే 6వ తేదీన 4324322 నుంచి 4499757 వరకు, 7న రిజిస్ట్రేషన్ నెంబర్ 4106200 నుంచి 4247463 వరకు, సెప్టెంబరు 8న 4247699 నుంచి 4491931 వరకు ఈ వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు వారి వైద్య పరీక్ష తేదీకి ముందు తగిన విధంగా సిద్ధం కావాలన్నారు. సంబంధిత ఆరోగ్య పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుని రావాలన్నారు.



స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామివారి పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భాద్రపద మాసంలో నవమినాటి రాత్రి నుంచి దశమి, ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు పూజా కార్యక్రమాన్ని మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు అర్చకులు దీక్షారాధన చేసి మూలవరులకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంచేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం నవకలశారాధన, సప్త కలశారాధన, పవిత్రాలకు అర్చనలు, స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద నిర్వహించి స్వామివారికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ ఎంకెటీఎస్వీ ప్రసాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడి ఎంపిక



బుర్రి పీయూష్

పిఠాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం లూధియానాలో ఈనెల 2నుంచి 9వ తేదీ వరకూ జరిగే 75వ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు పట్టణానికి బుర్రి పీయూష్‌ను ఎంపి క చేయగా, ఇప్పటికే బయలుదేరి వెళ్లాడు. పీయూష్‌ను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, బొజ్జా మాణిక్యాలరావు, కోశాధికారి కొత్తెం సుందరకుమార్, వీఎస్‌రెడ్డి, ఎం.రాజారావు, నంబోల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి ఆదాయం రూ.1.69 కోట్లు

అన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,69,06,902 నగదు, 39 గ్రాముల బంగారం, 765 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటు యూఎస్ఏకు చెందిన 170 డాలర్లు, యుఏఈ 455 దిరహమ్స్, సింగపూర్ 5 డాలర్లు, ఇంగ్లాండ్ 25 పౌండ్స్, పలుదేశాల కరెన్సీని భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు పాల్గొన్నారు. 32రోజులకు ఈ ఆదాయం సమకూరగా రోజుకు సరాసరిన రూ.5.28 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు.



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పాఠశాలలో అదృశ్యమై... కాలువలో శవంగా తేలి..

- పాఠశాల వదిలి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు
- రెండు రోజుల తర్వాత దొరికిన విద్యార్థి మృతదేహం
- పోస్టుమార్టం అడ్డుకున్న బంధువులు, రైతుకూలీ సంఘ నాయకులు

రంపచోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.వివేకానంద రెడ్డి (14) సోమవారం రంపచోడవరంలోని ఓ వాగులో శవంగా తేలాడు. వివరాల ప్రకారం.. రంపచోడవరం మండలం ఇసుకపట్ల గ్రామానికి చెందిన వివేకానంద రెడ్డి రంపచోడవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌తో సహా ఇతర ఉపాధ్యాయులెవరూ లేని సమయంలో ఆరుగురు విద్యార్థులు పాఠశాల వదిలి వాగు వద్దకు వెళ్లారు. కాగా అందులో వివేకానందరెడ్డి తప్ప మిగతా వారందరూ వెనక్కి వచ్చేశారు. వివేకానందరెడ్డి కోసం గాలించినా ఆచూకీ లభించలేదని ఐటీడీఏ ఒక ప్రకటనలో తెలిపింది.



విద్యార్థి మృతదేహం

విద్యార్థి అదృశ్యమైన సమాచారం ఉన్నతాధికారులెవ్వరికీ పాఠశాల నిర్వాహకులు ఇవ్వలేదు. శనివారం ఉదయం వివేకానందరెడ్డి మృతదేహాన్ని రంపచోడవరంలో ఓ వాగు వద్ద గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శవపరీక్షను మాత్రం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా విద్యార్థి బంధువులు, రైతుకూలీ సంఘం నాయకులు అధికారుల తీరుపై ఆందోళనకు దిగారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చూడడానికి వచ్చే తల్లిదండ్రులను కట్టడి చేసేందుకు ఉన్న నిబంధనలను పిల్లలు పాఠశాలలు వదిలి వెళ్లకుండా చేసేందుకు లేవా అంటూ గిరిజన సంక్షేమ డీడీని నిలదీశారు. బాధ్యులైన వారిపై సస్పెండ్ చేసి వదిలేయడం కాకుండా సర్వీసు నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. తమ డిమాండ్ల మేరకు న్యాయం చేస్తేనే మంగళవారం పోస్టుమార్టం జరగనిస్తామని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని విద్యార్థి కుటుంబసభ్యులు చెప్పారు.

హెచ్‌ఎం, వార్డెన్‌తో సహా నలుగురు సిబ్బంది సస్పెన్షన్

విద్యార్థి వి.వివేకానందరెడ్డి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఆగస్టు 30 నుంచి వివేకానంద రెడ్డి కన్పించడంలేదని పాఠశాల సిబ్బంది బంధువుల ఇళ్లలో వెతికారని, సోమవారం కాలువలో శవమై కన్పించాడన్నారు. విషయంపై పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోగా విద్యార్థి మృతిపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రధానోపాధ్యాయుడు టి.రాజబాబు, వార్డెన్ కుంజం వెంకన్నదొర, ఉపాధ్యాయుడు గరుజుల ధరణిధర్, సీఆర్‌టీలు ఎం.సత్యనారాయణ, లోత చంటిబాబు, సీఆర్‌టీ ఫిజికల్ డైరెక్టర్ కె.ప్రసాదరావుదొరను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏసీబీకి చిక్కారు..

- ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి
- రూ.28 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్, కారు డ్రైవర్
- కేసు నమోదు

ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ దాడులు నిర్వహించింది. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వాసుకృష్ణ, భాస్కర్, సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పొలం రిజిస్ట్రేషన్ నిమిత్తం రైతు వద్ద నుంచి నగదు డిమాండ్ చేసి తీసుకుంటుండగా సబ్‌రిజిస్ట్రార్‌ను పట్టుకున్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన గట్టి సుబ్రహ్మణ్యం అనే రైతు తన పేరు మీద ఉన్న 1.37 ఎకరాల భూమిని తన కుమారుడికి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.50 వేలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ కొన విమలస రోజినీ కుమారి లంచం డిమాండ్ చేసింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముప్పిరి వెర్రియ్య ద్వారా బేరం చేసుకుని రూ.28 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో గట్టి సుబ్రహ్మణ్యం ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం రిజిస్ట్రేషన్ అనంతరం రూ.28వేల నగదును సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి కారు డ్రైవర్ డి.దుర్గాప్రసాద్‌కు ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్టు డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నగదుతో పాటు కార్యాలయంలో అదనంగా ఉన్న రూ.35 వేల నగదును కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి, కారు డ్రైవర్ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.



ఏసీబీ దాడిలో పట్టుబడ్డ ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ సరోజినికుమారి, కారు డ్రైవర్



రైతు సుబ్రహ్మణ్యం

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన రేకపల్లి సీతామహాలక్ష్మి (70) సుమారు నెల క్రితం నిడదవోలు పట్టణంలోని ఓ కంటి ఆసుపత్రిలో కంటికి ఆపరేషన్ చేయించుకుంది. సోమవారం వైద్యులకు చూపించుకునేందుకు నిడదవోలు వచ్చింది. అయితే పట్టణంలో ఆర్వోబీ పనులు జరుగుతున్నందున ఆర్టీసీ బస్సులను బసివిరెడ్డిపేట శివాలయం వద్ద నిలిపివేస్తున్న నేపథ్యంలో అక్కడ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు సీతామహాలక్ష్మి రైలు పట్టాలు దాటుతుండగా విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో మృతిచెందిందని స్థానికులు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ఐదుగురు కుమార్తెలు ఉన్నారని బంధువులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ఫైల్‌ఫొటో



ఘటనా స్థలంలో సీతామహాలక్ష్మి మృతదేహం

నిలకడగా గోదావరి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- 13.10 అడుగులకు చేరిన నీటి మట్టం
- ఎగువ ప్రాంతాల్లో గోదావరి తగ్గుముఖం



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తుంది. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు నీటి మట్టం 13.10 అడుగుల వరకు పెరిగింది. ఆపై 16గంటలు నిలకడగా కొనసాగుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం అదే రీడింగ్ వద్ద కొనసాగుతుండగా కాటన్ బ్యారేజ్ ద్వారా 11,79,236 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది.

భద్రచాలం, కాళేశ్వరం వద్ద...

భద్రచాలం వద్ద 48.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం 12గంటల పాటు నిలకడగా కొనసాగి తగ్గుముఖం పడుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 43.60 అడుగులకు చేరుకుంది. ఎగువన కాళేశ్వరం వద్ద 12.570 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ సోమవారం సాయంత్రానికి 9.650 మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 16.850మీటర్ల వరకు పెరిగి తగ్గుతూ 14.370 మీటర్లకు చేరుకుంది. దుమ్ముగూడెం వద్ద తగ్గుతున్న నీటి మట్టం 11.800 మీటర్లు, కూనవరం వద్ద 19.610, కుంట వద్ద 10.820, పోలవరం వద్ద 12.750 మీటర్లుగా నీటి మట్టం చేరుకుంది. రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.540 మీటర్లు, ధవళేశ్వరం వద్ద 13.10 అడుగుల వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది.

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న గోదావరి జాలాలతో పాటు వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పురుషోత్తపట్నం నుంచి 1050 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా సోమవారం 14.55 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 80.98 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



జలాశయంలో నీటి నిల్వలు

విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడి సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడిని సస్పెండ్ చేస్తూ సోమవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న లచ్చన్న అనే ఉద్యోగి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినికి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడని సోమవారం మీడియాలో కథనాలు రావడంతో ఈవో విచారణ చేసి నిర్ణయం తీసుకున్నారు.

మద్యం తాగి విధులకు హాజరైన దేవస్థానం ఉద్యోగిపై...

అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్న దేవస్థానం ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్న ముని రాజేంద్రప్రసాద్ అలియాస్ కొంతం పండు మద్యం తాగి ప్రసాదం విక్రయాలు చేస్తున్నాడని భక్తుల ఫిర్యాదు మేరకు దేవస్థానం భద్రతా విభాగం అధికారులు తనిఖీ చేపట్టగా నిజమేనని నిర్ధారణకు వచ్చి ఈవోకు నివేదించడంతో చర్యలు తీసుకున్నారు.

ఏలేశ్వరం కమిషనర్ సస్పెన్షన్

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 21న బిల్డింగ్ కాంట్రాక్టర్ నుంచి రూ.23 వేలు లంచం తీసుకున్న కమిషనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అరుణాచలాన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వారిపై అధికారులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో ఆగస్టు 21 నుంచి కమిషనర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఏకే మల్లవరంలో ఒడిసా యువకుడి ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఒడిసా రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఒడిసా రాష్ట్రంలోని నవరంగపూర్ జిల్లా నేలగుండిగూడ గ్రామానికి చెందిన బైదనాద జానీ (17) ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ముదునూరి ధనుంజయవర్మ రొయ్యల చెరువులో పనిచేసేందుకు కూలీ పని నిమిత్తం వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30గంటల సమయంలో రొయ్యలచెరువు నుంచి బయటకు వెళ్లిన అతడు కాలువ గట్టు వద్ద గల వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి గల ప్రేమ వ్యవహారం, కుటుంబం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్తున్నారు. యువకుడి తండ్రి మన్ బత్ జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్ఐ ఎస్.రామకృష్ణ సోమవారం తెలిపారు.

తోడుంటానని బంగారు నగలు చోరీ

మహిళపై పోలీసులకు ఫిర్యాదు

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తోడుగా ఉంటానని చెప్పి వచ్చి ఒక మహిళ నగలు చోరీ చేసిందని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం పల్లపువీధికి చెందిన సురవత్తుల సత్యవేణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మే నెలలో తన భర్త చనిపోయాడని, తనకు తోడుగా ఉండేందుకు ఇసుకపల్లికి చెందిన రమాదేవి అనే మహిళ వచ్చిందని, 5కాసులు విలువైన బంగారు ఆభరణాలు అపహరించి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొంది.

బెహరాన్‌లో పుల్లేటికుర్రు మహిళ మృతి

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చిన ఏపీఎన్ఆర్టీఎస్ సంస్థ

అంబాజీపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం బెహరాన్ దేశం వెళ్లి అక్కడ మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన కాగిత అర్జమ్మ (62) మృతదేహాన్ని ఏపీఎన్ఆర్టీసీ సంస్థ కృషితో స్వగ్రామానికి తీసుకువచ్చారు. వివరాల ప్రకారం.. అర్జున 10 ఏళ్లుగా ఉపాధి నిమిత్తం బెహరాన్‌లో ఉంటుంది. అయితే గత నెల 14న అనారోగ్యంతో అక్కడ మృతిచెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు రూ.8లక్షల వరకూ ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సంస్థ, ఏపీఎన్ఆర్‌టీఎస్ సంస్థ సంయుక్తంగా నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్టు, ఏపీఎన్ఆర్‌టీఎస్ సంస్థలు ఖర్చు భరించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా కృషిచేశారు. ఏపీఎన్ఆర్‌టీఎస్ సంస్థ సభ్యులు నల్లి రవిశంకర్, కొల్లు సరోజిని, గంజి వెంకటలక్ష్మి, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఓ బాలరాజు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, కాండ్రేగుల గోపి, అందె మూర్తి, నాయకులు ఎల్.భాస్కరరావు, కత్తుల బాలరాజు, బాలస్వామిలకు పుల్లేటికుర్రు ఎస్సీ యూనియన్ కమిటీ సభ్యులు, మృతురాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అర్జమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ బాలరాజు, నాయకులు

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య



మనోజ్(ఫైల్)

గండేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెంలో ఓ ప్రయివేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. పార్వతీపురం జిల్లా సాలూరు మండలం దేవబుచ్చంపేట గ్రామానికి చెందిన జి.మనోజ్ (21) సూరంపాలెంలో ప్రయివేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. స్నేహితురాలికి, తనకు మధ్య మనస్పర్థలు రావడంతో ఆదివారం హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై అతడి తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి పోలీసులు తెలిపారు.

మస్కట్ నుంచి స్వగ్రామానికి...

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కృషితో చేరిన మహిళ

అమలాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఆరోగ్యం బాగోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మన్యం నాగమణి కోనసీమ సెంటర్‌ఫర్ మైగ్రేషన్ కృషితో సోమవారం క్షేమంగా స్వగ్రామం చేరుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలానికి చెందిన సరెళ్ల దివ్య తన తల్లి మన్యం నాగమణి మస్కట్‌లో పడుతున్న ఇబ్బందులను గుర్తించి తిరిగి స్వగ్రామం రప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఏజెంట్‌ను సంప్రదిస్తే రూ.1.60లక్షలు కడితేనే ఆమె స్వగ్రామానికి రాగలుగుతుందని చెప్పాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేకంగా వలసదారుల కోసం సెంటర్ ఫర్‌మైగ్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు దివ్య తెలుసుకుంది. వెంటనే సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులను ఆశ్రయించగా ఏజెంట్‌తో మాట్లాడి మస్కట్ దేశం నుంచి నాగమణిని స్వగ్రామం క్షేమంగా తీసుకువచ్చారని ఆనందంతో తెలిపింది.



మన్యం నాగమణి

కాకినాడలో కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి

- బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
- స్వల్ప లాఠీ చార్జి, పలువురికి గాయాలు



కాకినాడలో బీజేపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారు. మెయిన్‌రోడ్, సినిమారోడ్ కూడలిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇనుప కంచెలను బీజేపీ శ్రేణులు తోసుకుంటూ కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పరిస్థితిని అదుపులో తేవడానికి పోలీసులు స్వల్ప లాఠీ చార్జి చేసి అడ్డుకున్నారు. దీంతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం బయట రోడ్డు మీద బైఠాయించి రాహుల్ గాంధీ చిత్రపటాన్ని చెప్పుతో కొడుతూ మహిళలను గౌరవించని రాహుల్‌గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్, సాహితీవర్మ, జిల్లా కార్యదర్శి జ్యోతుల రాజేష్, మండలాధ్యక్షుడు దొడ్డి వీరేంద్ర, పలువురు నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు. ఘటనలో గాయపడిన నాయకులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి పంచాయతీ లంకకెట్టిపేటకు చెందిన గుత్తుల ప్రసాద్(36) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అతడు గణేశ నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ కారణంగా గుండె ఆగి కుప్పకూలాడంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ప్రసాద్ ఉదయం నుంచి అనారోగ్యంగానే ఉన్నాడని, ఊరేగింపు నుంచి ఇంటికి వచ్చి ఛాతిలో మంటగా ఉందనడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు స్థానికులు, బంధువులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా తమ సిబ్బంది ఊరేగింపులో ఉన్నారని, అక్కడ ఎటువంటి సంఘటన జరగలేదని ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.



ప్రసాద్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు

శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలు



లక్ష్మీగణపతి ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బిక్కవోలు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఆరో రోజైన సోమవారం బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో పోటెత్తింది.దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి బారులు దీరి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో బేరా గోవిందు, లక్ష్మణకుమారి దంపతులు అన్నదాన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు గ్రామంలోని గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించారు. చవితి ఉత్సవాల్లో భాగంగా ఆలయార్చకులు లక్ష్మీగణపతికి మూలమంత్ర పూజలు, మంత్ర జపతర్పణ, హోమాలు, సావిత్రి పంటకోట ఉపనిషత్తు పారాయణాలు జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబా రెడ్డి, సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్‌కు ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ పార్ట్ టైం ఉద్యోగుల వినతి



మాధవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైం టీచర్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పథకంలో ఉన్నత పాఠశాలల్లో పార్ట్ టైం ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేసి న్యాయం చేయాలని ఆర్ట్, క్రాఫ్ట్ పీఈటీ పార్ట్ టైం ఉద్యోగులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కోరారు. సోమవారం రాజమహేంద్రవరం వై.జంక్షన్ వద్ద సారథ్యం యాత్రకు వచ్చిన రాష్ట్రాధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలను ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరప రాజు, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. 14 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు కనీస వేతనం లేదని, తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని,ఆలోపు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామన్నారని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీమన్నారాయణరెడ్డి, సునీత, దేవి, పద్మ పాల్గొన్నారు.

ఉత్తమంగా 'సూపర్ సిక్స్' అమలు

రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ బత్తుల

దివాన్‌చెరువు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు ఉత్తమంగా అమలవుతున్నాయని యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్రడైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు)అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేని ప్రతిపక్షం వాస్తవదూరమైన ఆరోపణలు చేస్తోందన్నారు. ఇటీవల ప్రచారం చేసారని అన్నారు. అయితే పూర్తి పారదర్శకతతో సోమవారం పెన్షన్లు అందించడం ద్వారా దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్షం చేసిన ఆరోపణల్లో పసలేదన్న విషయం మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

ఏఆర్‌టీ చట్టంతో నైతిక, పారదర్శక సేవలు

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సహాయక గర్భధారణ, ఐవీఎఫ్, సరోగసీ వంటి విధానాల్లో దుర్వినియోగం జరగకుండా నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టం తీసుకొచ్చిందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ దంపతుల కలలను నెరవేర్చడంలో ఐవీఎఫ్, సరోగసీ ఉపయోగపడుతున్నాయని, ఏఆర్‌టీ చట్టంతో నైతిక, పారదర్శక సేవలు లభిస్తాయన్నారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తించిన, రిజిస్ట్రేషన్ కలిగిన ఆసుపత్రులు, కేంద్రాల్లోనే చికిత్స పొందాల్సి ఉంటుందన్నారు. అనుమతిలేని కేంద్రాల్లో చికిత్స చేయించుకోవడం వల్ల ప్రమాదాలు, మోసాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ఏఆర్‌టీ, ఐవీఎఫ్ సెంటర్లు, సరోగసీ సంబంధిత కేంద్రాలు తప్పనిసరిగా ఈ చట్టాల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనుమతిలేకుండా సెంటర్లు, కేంద్రాలు నడపరాదని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు చట్ట ఉల్లంఘనలు గమనిస్తే ఆరోగ్యశాఖకు సమాచారం అందించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సిద్ధం కావాలి: పీడీజే

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కి సిద్ధం కావాలని, పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. రాజమహేంద్రవరంలో సోమ వారం చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. రాజీకి అర్హమై పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకు అందజేయాలని ఆదేశించారు. బాధితులకు తగు పరిహారం అందజేసే దిశగా కూడా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

సీఎంగా చంద్రబాబు 30 వసంతాల వేడుక

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 30 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. సోమవారం రాజమహేంద్రవరం 3వ డివిజన్ సుబ్బారావుపేట, నెహ్రూ నగర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన సత్తిబాబు అనంతరం కేక్‌ను కట్ చేసి సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. వార్డు మహిళలు, పెద్దలతో ఆనందాన్ని పంచుకున్నారు.కార్యక్రమంలో బొమ్మనమైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

గాదరాడ డంపింగ్ యార్డ్ పరిశీలన

కోరుకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో చెత్త సేకరణ సమస్యను పారద్రోలేందుకు ప్రతి గ్రామంలో ఒక డంపింగ్ యార్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని గాదరాడ డంపింగ్ యార్డ్‌ను ఎంపీడీవో అశోక్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డంపింగ్ సమస్యను 3 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. డంపింగ్ యార్డులన్నీ వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమై పోయాయని తెలిపారు. అలా వదిలేయడం వలన అన్ని చోట్ల చెత్తా చెదారాలు పేరుకుపోయి, అనేక వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ప్రభుత్వం దీనిని ప్రక్షాళన చేయాలని యోచిస్తోందన్నారు.

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యగౌరి



అనపర్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ల జాబితాలో అనపర్తి నియోజకవర్గం నుంచి కర్రి సత్యగౌరికి స్థానం లభించింది. తెలుగుదేశం పార్టీలో సత్యగౌరి తన భర్త శ్రీనివాసరావు ప్రోత్సాహంతో పార్టీకి సేవ చేస్తున్నారు. 2020లో జరిగిన బిక్కవోలు జడ్పీటీసీ ఎన్నికల్లో ఆమె టీడీపీ తరఫున పోటీ చేశారు. బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన ఆమె మహిళా శక్తి టీమ్‌లో ప్రధాన భూమిక పోషించి కూటమి విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కడియం అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కడియం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడియంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ పరిశీలించారు. పిల్లలకు ప్రభుత్వం నుంచి పోషక ఆహారాలను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన ఆట వస్తువులను పిల్లలకు అందుబాటులో ఉంచాలని, చిన్నారుల మానసిక వికాసానికి ఉపయోగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫిల్టర్ వాటర్ సమస్య ఉందని తెలుసుకుని వెంటనే ఏర్పాటు చేయించారు. అలానే మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఓనం పండుగ సంబరాలు

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాజానగరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 3న ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేపీ యూన్సీ సోమవారం తెలిపారు. మండలంలోని అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షిస్తారని, అన్ని శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు

- ఎమ్మెల్యే గోరంట్ల, ప్రభుత్వ సలహాదారు షరీఫ్
- పలుచోట్ల పెన్షన్ల పంపిణీ



రాజమహేంద్రవరంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని, కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ షరీఫ్ అన్నారు. సోమవారం మండలంలోని కొంతమూరులో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దివ్యాంగులకు నకిలీ సర్టిఫికెట్లు పుట్టించి అనర్హులకు పింఛన్లు అందించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వారందరినీ గుర్తించి రీవెరిఫికేషన్ చేసి అనర్హులను తొలగించి, మరికొందరు అర్హులకు ఇచ్చే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో జరిగిన చిన్న చిన్న సాంకేతిక లోపాల వల్ల కొంత మంది అర్హులకు నోటీసులు జారీ వెళ్లాయని, ఈ విషయం ప్రభుత్వానికి తెలియడంతో సీఎం చంద్రబాబు స్పందిస్తూ నోటీసులు అందిన వారికి కూడా పింఛన్లు అందించాలంటూ ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిపై వైసీపీ తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై బురద జల్లుతోందన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాన్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం: స్థానిక 10వ డివిజన్‌లో చక్రధర్ హాస్పిటల్ పక్క వీధి, వీఎల్ పురం గొయ్యి వద్ద దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో రూ.30తో అప్పటి సీఎం ఎన్టీ రామారావు పెన్షన్లు ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు రూ.4 వేలు అందజేస్తున్నారన్నారు. అలాగే దివ్యాంగులకు రూ.6 వేలు, సంపూర్ణ దివ్యాంగులకు రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. నగరంలోని 95 సచివాలయాల్లో 28వేల మంది లబ్ధిదారుల్లో 513 మందికి నోటీసులు ఇచ్చి అందులో 18ఏళ్లలోపు వయసున్న దివ్యాంగులు, మానసిక వైకల్యం ఉన్న 135 మందికి నోటీసులు ఇచ్చి పరిశీలన చేసి ఉపసంహరించుకున్నారన్నారు. నోటీసులు ఇచ్చిన వారికి కూడా పింఛన్లు ఇచ్చారని చెప్పారు. కొత్తగా నగరంలో 5100 రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వై శ్రీను, చొప్పర్ల వీరభద్రరావు, వాసిరెడ్డి బాబీ, జామి సత్యనారాయణ, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, పంచికట్ల శివ ప్రసాద్, అప్పారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు/అనపర్తి: బిక్కవోలు మండలం తొస్సిపూడి, అనపర్తి మండలం రామవరంలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని, వైసీపీ హయాంలో ఇచ్చిన దొంగ పింఛన్లు మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే సింహ భాగాన్ని పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో బిక్కవోలు నుంచి ఎంపీపీ తేతలి సుమ, కర్రి శ్రీనివాసరావు, కొవ్వూరి గోవిందరెడ్డి, కర్రి సత్యగౌరి, తేతలి సూర్యచంద్ర, కర్రి శ్రీనివాసరెడ్డి, రామవరంలో తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, సర్పంచ్ గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని నరసాపురంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని స్థానిక కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వేల సంఖ్యలో వితంతువు, స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేసిందని భర్త చనిపోతే వెంటనే భార్యకు పెన్షన్ అందించేలా చర్యలు చేపట్టిందన్నారు.



నరసాపురంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

పండుగలా వినాయక చవితి

- మండపాలకు ఉచిత విద్యుత్ నిర్ణయం హర్షణీయం
- బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్



కందుకూరి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాధవ్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా వినాయక చవితి పండుగ వాతావరణంలో జరుగుతోంది. సీఎం చంద్రబాబు వినాయక చవితి పందిళ్లకు ఉచిత విద్యుత్ వెసులు బాటు వల్ల నిజమైన పండుగ జరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం సాయంకాలం ఆయన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులతో కలసి పాత్రికేయులతో చిట్‌చాట్ నిర్వహించారు. వచ్చే విజయదశమి పండగకు కూడా ఇదే సంప్రదాయం కొనసాగించాలని కోరుతున్నామన్నారు. కేంద్రం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు, బీసీ హాస్టల్‌లో సమస్యలను ప్రస్తావించారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంతో నామినేటెడ్ పదవులు కొన్ని వచ్చాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పోటీ చేయడానికి ప్రయత్నిస్తామని మాధవ్ అన్నారు.

కందుకూరికి నివాళులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కందుకూరి వీరేశలింగం సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర నాయకుడు మధుకర్, జిల్లా మీడియా కన్వీనర్ వీరా వీరాంజనేయులు, వీరన్నచౌదరి, జీవకారుణ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

అనపర్తి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుతుకులూరు-2 వైసీపీ ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి బీజేపీలో చేరారు. ఆయన పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోదీ చేస్తున్న పాలనకు ముగ్ధుడై బీజేపీలో చేరుతున్నట్టు దొరయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పురందరేశ్వరి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

'సారథ్యం'కు తరలిన నాయకులు

బిక్కవోలు/గోకవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోని సుబ్రహ్మణ్యం మైదానంలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యం లో సోమవారం జరిగిన సారథ్యం బహిరంగ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. అక్కడి వై.జంక్షన్ నుంచి సుబ్రహ్మణ్యం మైదానం వరకు వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులతో చేపట్టిన శోభాయాత్రలో పాల్గొన్నారు. బిక్కవోలు నుంచి ఎనిమిది బస్సుల్లోను, బైక్‌లు, కార్లలో వెళ్లారని బీజేపీ మండలాధ్యక్షుడు గుడిమెట్ల దుర్గారెడ్డి తెలిపారు. వెళ్లిన వారిలో బిక్కవోలు నుంచి ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్‌లు బండారు రమ్య, సరెళ్ల సుమలత, ఎంపీటీసీలు కొర్ల చక్రరావు, జంపా వెంకటలక్ష్మీ, గొర్రెల భాగ్యలక్ష్మి, తొండాపు శాంతిశ్రీలక్ష్మి, పోలినాటి సువర్ణలత, బండారు శివ, గోకవరం నుంచి ఉంగరాల ఆదివిష్ణు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు,కోన వెంకట్, తామర్ల రాంబాబు తదితరులున్నారు.

భారీ బైక్ ర్యాలీ

రంగంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన 'సారథ్యం' శోభాయాత్రలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 3వేల బైక్‌లతో భారీ ర్యాలీగా రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం నుంచి వెళ్లాయి. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి స్వయంగా బుల్లెట్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే మహిళలు బస్సుల్లో వెళ్లారు.



బైక్‌లపై ర్యాలీగా రాజమహేంద్రవరం వెళ్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం సహాధ్యక్షుడిగా కోలా



సీతానగరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా బొబ్బిల్లంక జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన రెండోసారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల సాధనకు కృషిచేస్తానన్నారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన రాష్ట్రాధ్యక్షుడు చెవ్వూరు రవి,ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, సంఘం పెద్దలు జీవీ నారాయణరెడ్డి, దేవినేని వెంకటరమణ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత అదృశ్యం

సీతానగరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) తన కుమార్తె కనిపించడం లేదని ఎర్రగొగిల పార్వతి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ వివరాల మేరకు.. హైదరాబాద్‌లో ఉంటున్న పార్వతి తన కుమార్తె రత్నకుమారి (30)ని రఘుదేవపురం గ్రామానికి చెందిన మేడిశెట్టి శివకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. రత్నకుమారి దంపతులకు ఆగస్టు 17న గొడవ జరిగింది.తల్లికి ఫోన్ చేసి తన భర్త తరచు కొడుతున్నాడని చెప్పింది. విషయం తెలుసుకుందామని అల్లుడికి ఫోన్ చేస్తే అల్లుడు ఫోన్ తీయకపోవడంతో చుట్టుపక్కల తెలిసున్న వారికి ఫోన్‌చేసి వాకబుచేయగా రత్నకుమారి ఇక్కడ లేదని తమకు కనిపించడం లేదని చెప్పడంతో ఆందోళనకు గురైన తల్లి హుటాహుటిన సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలు బంగారం చోరీ

ధవళేశ్వరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు దుండగులు చోరీ చేశారు. బాధితురాలు వంక సాహిత్య ఇచ్చిన ఫిర్యాదు, పోలీసుల వివరాలు ప్రకారం.. స్థానిక అత్తిలి వెంకన్న పాన్‌షాపు వెనుక వినాయక గుడి వీధిలో వంకా బాలకృష్ణ అన్నదమ్ములు ఒకే బిల్డింగ్‌లో కాపురం ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 11గంటల సమయంలో బాలకృష్ణ భార్య సాహిత్య ఇంటికి గడియ పెట్టి పైపోర్షన్‌లో ఉన్న తోడికోడలు వద్దకు వెళ్లింది. తిరిగి 12గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూసే సరికి తాళం వేసిన బీరువా తలుపులు తెరిచి ఉండి బీరువాలో ఉన్న ఐదున్నర కాసుల బంగారు వస్తువులు, వెండి వస్తువులు మాయమయ్యాయి. దీంతో సాహిత్య ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

5 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

కోరుకొండ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోరుకొండ సీఐ వై.సత్య కిశోర్‌కి వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ కేవీ నాగార్జున, సిబ్బందితో కోటి గ్రామ శివారులో పేకాట ఆడుచున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.70 వేలు నగదు, 5 సెల్‌ఫోన్‌లు, 5 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీ రంగపట్నానికి చెందిన తనకాల వరప్రసాద్, అత్తిలి నాగ వీరభద్ర శ్రీనివాస్, బొబ్బిలి రమణ, యల్లాపు దుర్గా అప్పారావు, బండి ఈశ్వర్, కొవ్వూరి లోవరాజు, బండి వీరబాబులను అరెస్టు చేశారు. బొడ్డేటి వీరవెంకటరమణ, జొమ్మల చిన్న పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిని కోర్టుకు తరలించామన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 159 అర్జీలు
జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



అర్జీదారుడితో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పలు సమస్యలపై 159 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీదారులుకు సంతృప్తి కలుగకపోవడం వల్లనే ఫిర్యాదులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. వీటిపై జిల్లా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. మొత్తం 159 అర్జీలలో 150 ఆఫ్‌లైన్‌లోను, 9 అర్జీలు ఆన్‌లైన్‌లోను స్వీకరించామన్నారు. వీటిలో రెవెన్యూ శాఖకు 93, పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 75, పౌరసరఫరాల శాఖకు 43, పాఠశాల విద్యాశాఖకు 7, విద్యుత్ శాఖకు4 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అలాగే రవాణా శాఖకు, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలకు రెండేసి చొప్పున,మౌలిక సదుపాయాలు పెట్టుబడులు, సామాజిక సంక్షేమ, జలవనరులు, పర్యావరణం, అటవీ, సాంకేతికత, పరిశ్రమల, వాణిజ్య శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 28 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 28 అర్జీలను స్వీకరించి తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీ కృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు 17 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ వివిధ సమస్యలపై 17 అర్జీలు స్వీకరించారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి 7, టౌన్ ప్లానింగ్‌కు 4, రెవెన్యూశాఖకు 6 వచ్చాయి. వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా బొమ్మూరు నుంచి ఐతిరెడ్డి చిన్నారి అనే మహిళ టీడీపీ హయాంలో తనకు వచ్చిన టిడ్కో ఇంటిని అప్పగించలేదని, కార్పొరేషన్ మార్టుగేజ్ పూర్తయితేనే రిజిస్ట్రేషన్ అయ్యి తన ఇంటికి ఒక క్లారిటీ వస్తుందని దీని కోసం గత ఆరు మాసాలుగా బ్యాంక్ అధికారులు, కార్పొరేషన్ సీవోల వద్దకు తిరుగుతున్నానని, ఎవ్వరూ పట్టించుకోవడం లేదని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వివరించింది. ఈ సమస్యపై ఆయన స్పందిస్తూ సీవోలను నిలదీశారు. దీనికి సాంకేతిక కారణాలు ఉన్నాయని సీవోలు చెప్పే ప్రయత్నం చేయగా అదేమి చెప్పవద్దని తిరుపతి, నెల్లూరు వంటి చోట్ల పూర్తయిన మార్టుగేజ్ రాజమహేంద్రవరంలో ఎందుకు పూర్తి కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, ఆర్‌వో శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కార్పొరేషన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

ఆళ్ల గోవిందుకు పలువురి పరామర్శ



రంగంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు తల్లి ఆళ్ల వీర్రాఘవలు ఆగస్టు 31న మృతిచెందారు. ఈ సందర్భంగా సోమవారం ఆళ్ల సీతారామయ్యను, ఆళ్ల బ్రదర్స్‌ను పలువురు పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ నాయకులు గన్ని కృష్ణ, అనపర్తి సీఐ సుమంత్, రంగంపేట ఎస్ఐ శివప్రసాద్, ఎంపీడీవో వీవీ సాయిబాబు, తహశీల్దార్ కె.అనసూయ, సాయి హాస్పిటల్ డాక్టర్ విజయ్ కుమార్, తదితర కూటమి నాయకులు, గ్రామస్థులు పరామర్శించారు.

ప్రభుత్వ హైస్కూల్‌కు ఫర్నీచర్ బహూకరణ

రాజానగరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగుబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న వై.ఆగ్నేశ్వరరావు సదరు పాఠశాలకు ఫర్నీచర్ బహూకరించారు. ఎంఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌ల సమక్షంలో టేబుల్, బీరువా, కుర్చీలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, పవన్‌కుమార్ తదితులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో నిర్వహించిన సారథ్యం యాత్రలో బీజేపీ జెండాలతో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు

మహా..ప్రసాదం



తాళ్లపూడి మండలం రావూరుపాడులో సోమవారం గణపతికి 108 రకాల ప్రసాదాలు నివేదన చేశారు. సాయంత్రం భక్తులకు పంపిణీ చేశారు. - తాళ్లపూడి

గణపతికి గోల్డెన్ టెంపుల్



చవితి ఉత్సవాల్లో భాగంగా కొవ్వూరు లాంచీల రేవు వద్ద నమూనా గోల్డెన్ టెంపుల్ కట్టి 12 అడుగుల గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. - కొవ్వూరు

గోదారి ఘాట్ల వద్ద దిగొద్దు

ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్



ధవళేశ్వరం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని. వినాయక విగ్రహాల నిమజ్జనం చేసే ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ సూచించారు. ఘాట్లవద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, పిల్లలు నదిలోకి దిగవద్దని హెచ్చరించారు. వరద ఉధృతి మరికొన్ని రోజులు ఉంటుందన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు



కార్డు..కష్టం!

ఆలోచన స్మార్ట్.. అమలులో నిర్లక్ష్యం

ఇంటింటికీ పంపిణీ లేదు - డీలర్ల వద్దకు వెళ్లలేక ఇక్కట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో అధికారులు చేసేదొకటి.. ఎక్కడా పొంతన ఉండడంలేదు.. సర్కారు ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు.. స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ సిబ్బంది ఆగస్టు 25వ తేదీ నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తారని తొలుత ప్రకటించారు.అయితే అలా ఎక్కడా జరగలేదు.. ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్ల వద్ద స్మార్ట్ కార్డుల పంపిణీ ఆరం భించారు.. ఆయా రేషన్ షాపులకు వెళ్లడానికి వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జనం ఇబ్బందులు పడుతు న్నారు. ఇంటి వద్దకే స్మార్టు కార్డులను తెచ్చి ఇస్తారని ప్రభుత్వం ప్రకటిం చింది. కానీ వాస్తవంలో తక్కువగా అమలు జరుగుతోంది. రేషన్ పోర్టబిలిటీ వెసులుబాటు వల్ల చాలా మంది ఎక్కడెక్కడో రేషన్ తీసుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం తమ కార్డు ఏ రేషన్ షాపునకు వెళ్లిందనేది అయోమ యంగా మారింది. తొలిసారిగా ఎక్కడైతే రేషన్ తీసుకున్నారో ఆ షాపునకు కార్డులు వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుపై చౌక ధరల దుకాణం నెంబరు ఉంటుంది. కాలక్రమేణా లబ్ధిదారులు నివాసాల మార్పు వల్ల స్మార్ట్ రేషన్ కార్డు చేతికి అందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో స్మార్ట్ కార్డు పంపిణీ మొదలు పెట్టి వారం కావొస్తున్నా 40 శాతమే లబ్ధిదారులకు చేరాయి. అంటే ఇప్పటి వరకూ దాదాపు 2.25 లక్షల కార్డులు మాత్రమే లబ్ధిదారులకు చేరాయి. ఇంకా సుమారు 3.34 లక్షల కార్డులు చేరాల్సి ఉంది.ఈ నెల 15 వరకూ సమయం ఉండడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నా..ఈ రోజు తీసుకోకపోతే కార్డు వెనక్కి వెళ్లిపోతుందని క్షేత్రస్థాయి సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురై రేషన్ షాపుల వెతుకులాటలో విసుగుచెందుతున్నారు. జిల్లాలో 5.63 లక్షల రేషన్ కార్డులు ఉండగా 5.59 లక్షల స్మార్ట్ కార్డులు తొలి దశలో వచ్చాయి. రెండో దశలో మిగతావి రానున్నాయి. పింఛన్ ఇస్తున్నట్టే వీఆర్వోలు లేదా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్మార్ట్ కార్డులు అందజేయాలనే వాదన ఉంది.ఏదైనా రేషన్ షాపు దగ్గరకు వెళ్లి ఈ-పోస్ యంత్రంలో ప్రస్తుత కార్డు నెంబరు నమోదు చేస్తే స్మార్ట్ కార్డు ఏ షాపునకు వెళ్లిందనే వివరాలు ఉంటాయని జిల్లా పౌర సరఫరాల అధికారి పార్వతి చెప్పారు.

ఏటీఎం కార్డులా...

కూటమి ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్ రేషన్ కార్డులను తెచ్చింది.ఇది ఏటీఎం కార్డులా ఉంది. దీనిపై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కుటుంబీకుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ పరిమాణం, తీసుకున్న వివరాలు, డిపో చిరునామా వంటివి తెలుస్తాయి. రేషన్ తీసుకోగానే రాష్ట్ర, జిల్లా కార్యాలయాలకు చేరుతుంది. పక్కా లెక్కలు వస్తాయి. దీంతో అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.





ఎరువు..కరువు : సీతానగరం మండలం వంగలపూడి సొసైటీ వద్ద యూరియాకు రైతుల క్యూ.. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీ వద్ద రైతుల ఆందోళన

యూరియా క్యూ

అధికారులు కొరత లేదంటారు.. రైతులు చూస్తే కొరత అంటారు.. సొసైటీల వద్ద ప్రతి రోజూ పెద్ద ఎత్తున క్యూ లు కడుతున్నారు.. ఆయా మండలాలకు సరిపడా సరఫరా చేసిన యూరియా ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే యూరియా బాధలు తీరడం లేదు.. రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి.. రైతులు రోజూ యూ రియాకు కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు.. రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, గోకవరం మండలాల్లో పలు సొసైటీల వద్ద యూరియాకు పడిగాపులు కాశారు.. ఇక కోరుకొండలో అయితే రైతులు ఆందోళనకు దిగారు. అయినా అధికారులకు పట్టడంలేదు.

- జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత
- లబోదిబోమంటున్న రైతాంగం

కోరుకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. శ్రీరంగపట్నం సొసైటీ వద్ద రాఘవాపురం, బొల్లెద్దుపాలెం గ్రామాలకు చెందిన రైతులు సోమవారం యూరియా అందడం లేదని ఆందోళనకు దిగారు. శ్రీరంగపట్నం సొసైటీకి ఇప్పటికే 182 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చారు. శ్రీరంగపట్నం, కోటి గ్రామాలకు ఆదివారం మరో 10 టన్నుల చొప్పున యూరియా అధికారులు సరఫరా చేశారు. అయితే తమకు ఎరువులు అందడం లేదని శ్రీరంగపట్నం సొసైటీ పరిధిలోని రాఘవాపురం, బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేశారు. దీంతో సోమవారం శ్రీరంగపట్నంలో ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. మండల వ్యవసాయాధికారులు, పోలీసులు శ్రీరంగపట్నం సొసైటీకి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. మండల వ్యవసాయాధికారి జిల్లా వ్యవసాయాధికారితో మాట్లాడి రాఘవాపురం గ్రామానికి 20 టన్నుల యూరియాను పంపే ఏర్పాటు చేయడంతో రైతులు శాంతించారు.రాఘవాపురం గ్రామానికి 100 బస్తాలు, బొల్లెదుపాలెం గ్రామానికి 100 బస్తాలుచొప్పున ఇచ్చామన్నారు. శ్రీరంగపట్నం సొసైటీ వద్ద 350 బస్తాల యూరియాను మంగళవారం రైతులకు అందజేస్తామన్నారు. కోటి గ్రామంలో 225 బస్తాలు రైతులకు అందించే ఏర్పాట్లు చేశారు. కోరుకొండ సొసైటీకి ఆదివారం సాయంత్రం వచ్చిన 20 టన్నుల యూరియాను సోమవారం పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున అందజేశారు.కోరుకొండ సొసైటీ పరిధిలో 10 గ్రామాల్లో 5 వేల మంది రైతులున్నారు. శనివారం 115, సోమవారం 225 మంది రైతులకు 30 టన్నుల యూరియా అందజేశారు.సొసైటీ పరిధిలో సుమారు 2500 మంది రైతులు యూరియాకు ఎదురుచూస్తున్నారు.

పొంతనలేని అధికారుల లెక్కలు..

గోకవరం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరతే లేదంటూ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులు పదేపదే ప్రకటనలు చేస్తు న్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. యూరియా కోసం రైతన్నలు తిండి, తిప్పలు మాని సొసైటీల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ముందు ఎవరు ఉంటే వారికే యూరియా దక్కుతుందనే ఆశతో సొసైటీల వద్దకు ఉదయాన్నే చేరుకుంటున్నారు. ఆ తరువాత వారి అదృష్టాన్ని బట్టి యూరియా లభిస్తోంది. గోకవరం సొసైటీ వద్దకు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది రైతులు పడిగాపులు కాశారు. పోలీసుల పర్యవేక్షణలో సిబ్బంది ఇచ్చినంత యూరియా తీసుకొని ఇళ్ళకు వెళ్లారు. అర్ధరాత్రి అయినప్పటికీ సొసైటీ అధికారులు వచ్చిన రైతులందరికీ యూరియా ఇచ్చారు.

ఆధార్‌కార్డుపై.. ఒకే ఒక బస్తా..

సీతానగరం,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కష్టాలు తొలగడం లేదు. ఆధార్ కార్డుపై ఒకే ఒక్క యూరియా బస్తా ఇస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎకరాకు 3 బస్తాలు అవసరం కావ డంతో సొసైటీల వద్ద క్యూ కడుతున్నారు.సోమవారం వంగలపూడి సొసైటీ వద్ద పెద్ద ఎత్తున క్యూకట్టారు. పలువురు రైతులకు యూరియా అందలేదు. దీనిపై ఏవో గౌరిదేవిని ప్రశ్నించగా వాస్తవంగా రైతులు యూరియాను అదనంగా వాడేశారన్నారు. సీతానగరం మండలానికి 900 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే 1818 మెట్రిక్ టన్నులు వాడారన్నారు.మంగళవారం మరికొంత యూరియా మండలానికొచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

రెండేళ్లలో పోలవరం

- ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లిచ్చాం
- బీజేపీ పటిష్టానికి చర్యలు
- త్వరలో మన పార్టీ - మన జెండా
- కుంభమేళా తరహాలో పుష్కరాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. వచ్చే రెండేళ్లలో పోలవరం ఎడమకాలువ ద్వారా నీళ్లు ప్రవహించేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు.రాజమహేంద్రవరంలో సోమవారం చాయ్ పే చర్చ, సారథ్యం యాత్ర, బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీని గ్రామస్థాయిలో పటిష్టం చేయడానికి " మన పార్టీ మన జెండా" పేరుతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. వైసీపీ హయాంలో పోలవరం పనులు నత్తనడకన జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్లు ఇచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయన్నారు. కూటమిలో సముచిత స్థానం లభించడంలేదని కొంతమందిలో అసంతృప్తి ఉన్నమాట వాస్తవమే అయినా మూడు పార్టీలకు సమన్యాయం చేస్తూ పదవులు లభిస్తున్నాయనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కుంభమేళా తరహాలో రాజమహేంద్రవరం పుష్కరాలను ఘనంగా నిర్వహించాలనే ఆలోచన జరుగుతున్నదన్నారు. రాజమహేంద్రవరం తనకు అత్యంత ఇష్టమైన ప్రాంతం అన్నారు. మహనీయుడు కందుకూరి వీరేశలింగం నడయాడిన రాజమహేంద్రవరం రావడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 19 జిల్లాల్లో సారథ్యం యాత్ర ముగిసిందని, 20వ జిల్లా తూర్పుగోదావరి అన్నారు. రాజకీయ క్షేత్రం అంటేనే బురదమయం అన్నారు. దేవుడి దర్శనానికి వెళ్లాలంటే డబ్బులు ఇవ్వాల్సి రావడం బాధగానే ఉందన్నారు. అయోధ్య రామాలయంలో దర్శనం, ప్రసాదాల విషయంలో ఆదర్శవంతమైన వ్యవస్థ నిర్మాణమైంది. అలాంటి వ్యవస్థ అన్ని చోట్లా జరగాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ ప్రస్థానంలో కార్యకర్తల భాగస్వామ్యం ప్రధానమైందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత బీజేపీ కార్యకర్తలకే దక్కుతుందని అన్నారు. మోదీ తల్లి గురించి రాహుల్‌గాంధీ మాట్లాడిన తీరు దారుణమని, సంస్కారం లేకుండా చేస్తున్న ఇలాంటి విమర్శలను తిప్పికొట్టాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని..రాష్ట్రానికి అవసరమైన సహకారం అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ దిశ, దశ మార్చే శక్తియుక్తులు మాధవ్‌లో ఉన్నాయన్నారు. ముందుగా వై.జంక్షన్ నుంచి దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానం వరకూ పాదయాత్రగా ర్యాలీ చేశారు.ఆయన వెంట బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, దయాకర్‌రెడ్డి, పరిమి రాధ, నర్సిపల్లి హారిక, కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి శ్రీనివాస్,క్రెడాయ్ ఏపీ చైర్మన్ శ్రీనివాస్,షేక్ సుభాన్ ఉన్నారు.

కొంతమూరులో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ప్రభుత్వ సలహాదారు షరీఫ్



తొలిరోజే 93 శాతం పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లలో జోరు కనబడింది. ఉదయం నుంచి మొదలు పెట్టి సుమారు 4వేల మంది సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. 2,35,813 మంది లబ్ధిదారులకు 2,19,792 మంది చేతికి రూ.95 కోట్ల 52 లక్షల 59 వేల 500 పింఛను రూపేణా అందించారు. రాత్రి 8 గంటల సమయానికి 93.21 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మండలాల విషయానికొస్తే మొదటి మూడు స్థానాల్లో వరుసగా రాజమహేంద్రవరం అర్బన్, నిడదవోలు అర్బన్, గోపాలపురం నిలిచాయి. రాష్ట్రంలో తూర్పు గోదావరి ఏడో స్థానంలో నిలిచినట్టు డీఆర్డీఏ పీడీ మూర్తి వెల్లడించారు.

ప్రభుత్వ వైద్య సేవల్లో జిల్లాకు 3వ స్థానం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తాజా ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సర్వేలో ప్రభుత్వ ఆరోగ్యసేవలపై తూర్పుగోదావరి జిల్లా 3వ స్థానం సాధించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వైద్యాధికారులతో సమీక్షలు జరపడం వల్ల ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. జిల్లాకు 3వ ర్యాంకు లభించడం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న వైద్యసేవలకు నిదర్శనమన్నారు.



రియల్..ఛాన్స్!

అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకో అవకాశం

ఏ ప్లాట్‌కు ఎంత?

అనధికార లేఅవుట్‌లో కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎవరికి వారు ఎల్ఆర్ఎస్ స్కీమ్ వర్తింపచేసుకో వ చ్చు. మొత్తం లేఅవుట్ క్రమబద్ధీకరించుకోవచ్చు. సాధారణంగా అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత లేఅవుట్ యజమాని అందుబాటులో ఉండడు. అందువల్ల కొనుగోలు దారులే చేయించుకోవాల్సి ఉంటుంది. ప్లాట్ ఏరియాను బట్టి పీనలైజేషన్ చార్జీలు నిర్ణయించారు. 100 చదరపు మీటర్ల వరకూ ఒక చదరపు మీటరు చార్జీ రూ.200 చెల్లించాలి. 100 నుంచి 300 చదరపు మీటర్ల వరకూ ఉంటే ఒక్కో చదరపు మీటరుకు రూ.400 చెల్లించాలి. 300 నుంచి 500 చ.మీ వరకూ ఉంటే ఒక్కో చ.మీ.కీ రూ.600 చెల్లించాలి. 500 చ.మీ దాటి ఉంటే ఒక్కో చ.మీ.కి రూ.750 చెల్లించాలి.ఈ చార్జీలన్నీ గత జూన్ 30వతేదీలోపు ఆయా ప్రాంతాల్లో ఉన్న భూమి మార్కెట్ విలువను బట్టి వర్తిస్తుంది. 3 వేల లోపు చదరపు గజాలకు 20 శాతం, 3 వేల నుంచి 5వేల లోపు వాటికి 30 శాతం, 5001 నుంచి 10 వేల లోపు వాటికి 40 శాతం, 10001 నుంచి 20 వేల వరకూ 50 శాతం, 20001 నుంచి 30 వేల వరకూ 60 శాతం, 30,001 నుంచి 50 వేల వరకూ 80 శాతం, 50 వేల చదరపు గజాలు ఉంటే 100 శాతం పీనలైజేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.ఆ.లేఅవుట్‌లో ఓపెన్ సైట్ (కామన్‌సైట్) లేకపోతే ప్లాట్ విలువులో 14 శాతం చెల్లించాల్సి ఉంది. అనధికార లేఅవుట్లలో ప్లాట్ కొనుగోలు చేసిన యజమానులు నష్టపోవాల్సి వస్తుంది.అనధికార లేఅవుట్ యజమానిపై చర్య లేమీ ఉండవు.అతడు ప్లాట్లన్నీ అమ్మేసుకుని డబ్బు చేసు కుంటాడు.ఇవి క్రమబ ద్ధీకరించుకోవడానికి అవసరమైన డబ్బంతా ప్లాట్ల యజమానులే భరించాలి. అందుకే ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో అనధికార ప్లాట్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది.

తక్కువ ధరకు భూమి వస్తుందని ప్లాటైపోతారు.. పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేస్తారు.. తీరా ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు రావు.. అప్పుడు ఆరా తీస్తే అనధికార లేఅవుట్ అని తేలుతుంది.. ఎంత ప్రయత్నించినా అనుమతులు రాక లబోదిబో మంటారు.. అటువంటి ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఒక అవకాశం ఇచ్చింది.. అదే ఎల్ఆర్ఎస్.. ఈ స్కీమ్‌లో కొంత మొత్తం చెల్లించి ప్లాట్ క్రమబద్ధీకరించుకోవచ్చు. మరికెందుకు ఆలస్యం..రియల్ ఛాన్స్ ఉపయోగించుకోండి.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

తెలిసో..తెలియకో అనధికార లేఅవుట్లలో రూ.లక్షలు పోసి ప్లాట్లు కొనుగోలు చేస్తారు.. ఆ ప్లాట్లలో ఏమైనా నిర్మాణాలు చేద్దామంటే అనుమతులు లభించవు. దీంతో వేలాది మంది ఇబ్బంది పడుతుంటారు. ఇలా సతమతమవుతున్న వారికి ప్రభుత్వం ఒక అవకాశం ఇచ్చింది. అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) స్కీమ్‌ను ముందుకు తెచ్చింది. ఈ మేరకు జూలై 26వ తేదీన జీవో జారీ చేసింది. 90 రోజుల్లో ఈ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలనే నిబంధన ఉంది. ఇప్పటికే నెలరోజులైంది. ఇక సుమారు రెండు నెలల్లోపే గడువు ఉంది. అయితే స్పందన అంతగా లేకపోవడంతో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు.గత జూన్ 30లోపు అనధికార లేఅవుట్లు, ప్లాట్లుగా ఉన్నవాటికి ఈ స్కీమ్ వర్తిస్తుంది.

అనధికార ప్లాట్లు అంటే..?

ప్రభుత్వం నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా ఏదైనా భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేస్తారు. సాధారణంగా లేఅవుట్ వేయాలంటే 10 శాతం కామ న్ సైట్ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే ఎకరం లేఅవుట్ వేస్తే దానిలో 10 సెంట్లు కామన్ సైట్‌గా వదిలే యా లి. రోడ్లు నిబంధనలకు తగినట్టు ఏర్పాటు చేయాలి. లేఅవుట్ వేయడానికి ముందు పొలానికి కన్వర్షన్ ఫీజు చెల్లించాలి. ఆ తరువాత నిబంధనల మేరకు లేఅవుట్ విభజించి డీటీసీపీ అనుమతులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ తతంగం అంతా చేస్తేనే అది లేఅవుట్ లెక్కలోకి వస్తుంది. ఈ వ్యవహారం అంతా ఖర్చుతో కూడుకున్న పనికావడంతో రాజకీయ పలుకుబడి ఉన్న రియల్టర్లు కనీస అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేసేస్తారు. వీటినే అనధికార లేఅవుట్లు అంటారు. ఈ లేఅవుట్‌లో ప్లాట్ తీసుకుంటే పంచాయతీ అయినా.. పట్టణంలో అయినా భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వరు. ఆ లేవుట్‌లో మౌలిక వసతులపై దృష్టి పెట్టరు. దీంతో భూమి తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేసినా ఆ తరువాత చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

రుడాలో 300పైనే అనధికారం

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) పరిధిలో 390 గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో గతంలో ఆన్‌లైన్‌లో సేకరించిన వివరాల ప్రకారం 300పైనే అనధికార లేఅవుట్లు ఉన్నాయి. వాటి సంఖ్యను వాస్తవంగా సేకరించే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు.ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులను అనధికార లేఅవుట్ల వివ రాలు ఇవ్వాలని ఆదేశించారు. వాస్తవానికి 2020లో ఎల్ఆర్ఎస్ జీవో వచ్చింది. 2019 ఆగస్టు 31వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్లకు అది వర్తించేలా జీవో ఇచ్చారు.కానీ అప్పటికి సుమారు 3 వేల దరఖాస్తులు వచ్చాయి.అవన్నీ పరిష్కారం కాలేదు. క్రమంగా 2వేల దరఖాస్తులు పరిష్కరించారు. మరో 1000 వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు 2025 జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ చేసుకున్న అనధికార ప్లాట్లకు వర్తించేలా జూలై 26న ప్రభుత్వం జీవో ఇచ్చింది. 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది.స్కీమ్ గ్రామాలు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు వర్తిస్తుంది.

- రుడా పరిధిలో 300పైనే లేఅవుట్లు
- తక్కువ ధరకు స్థలాల కొనుగోళ్లు
- నాన్‌లేఅవుట్లని తెలిశాక లబోదిబో
- అందుబాటులోకి ఎల్ఆర్ఎస్ స్కీమ్
- మరో 2 నెలల వరకూ అవకాశం
- జూన్30లోపు లేఅవుట్లకే వర్తింపు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఉండ్రాజవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్నులో సోమవారం రేషన్ కార్డులకు సంబంధించి స్మార్ట్ కార్డులను గ్రామసర్పంచ్ జీ. సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ కార్డుల వల్ల భవిష్యత్‌లో ఎన్నో ఉపయోగాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

గణపతి బొప్ప మోరియా

• కొనసాగుతున్న గణేష్ నిమజ్జనాలు • పెద్ద ఎత్తున పురవీధుల్లో విగ్రహాల ఊరేగింపు



గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొవ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు సోమవారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. దీనిలో భాగంగా పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు 15 విగ్రహాలను శోభాయమానంగా ఊరేగిస్తూ నిమజ్జనాల కోసం గోష్పాదక్షేత్రానికి తీసుకువచ్చారు. పట్టణ సీఐ పీ.విశ్వం, ఎస్ఐ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో క్రేన్ సహాయంతో గోదావరిలో నిమజ్జనం చేయించారు. నది వరద ఉధృతి అధికంగా ఉండడంతో ఎవరూ దిగకుండా ఫైర్, పోలీస్ సిబ్బందితో పాటు గజఈతగాళ్లను నియమించారు. నిమజ్జన ప్రక్రియను అడిషనల్ ఎస్పీ క్రైం ఎల్. అర్జున్, కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ పరిశీలించారు. అలాగే వేములూరులో విగ్రహాన్ని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోష్పాదక్షేత్రానికి తెచ్చి నిమజ్జనం చేశారు.

చాగల్లు : మండలంలోని ఊనగట్లలో గణేష్ ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి పురవీధుల్లో తిప్పారు. డప్పువాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో వైభవంగా సాగింది. అలాగే పాటెమ్మపేటలో ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహం ఊరేగింపు వేడుకగా సాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా సోమవారం మందిరాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఎడ్లబండిపై వినాయకుడిని అలంకరించి, బాణసంచాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. బాలదుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు కామిశెట్టి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వెలగదుర్రులో సోమవారం కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయకుని ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని బ్యాండుమేళాలు, బాణాసంచాతో నిమజ్జనానికి తరలించారు. ఉండ్రాజవరం, పాలంగిలోనూ కార్యక్రమాలు జరిగాయి. తాడిపర్రు విజయగణపతి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన చేశారు.

పెరవలి: తీపర్రులోని శ్రీ బాలగణపతి వినాయక మండపం వద్ద సోమవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. కర్రి శ్రీను అనే భక్తుడు రూ. 20 వేలకు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ లడ్డూని అతనికి అందజేసింది. అలాగే వివిధ ఆలయాల వద్ద కూడా లడ్డూ వేలం పాటలు నిర్వహించారు.



దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

జిల్లా సభను జయప్రదం చేయండి : ఐఎఫ్‌టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఈ నెల 14న జరగనున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘాల జిల్లా సభను జయప్రదం చేయాలని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పామర్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం రాయిపేటలో ఉన్న ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఐఎఫ్‌టీ యూ ఆధ్వర్యంలో దీనికి సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమగ్రమైన చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. మల్లిడి రామిరెడ్డి, కిల్లాని గోపాల్, షేక్ హుస్సేన్ వల్లీ, శ్రీనివాస్, అహ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



త్యాజంపూడిలో నిరసన తెలియజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దేవరపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం త్యాజంపూడిలో సాయిరామ్ తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బాల కార్మిక సమస్యలపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్ బాబు మాట్లాడుతూ భవన కార్మిక సమస్యల కోసం అనేక సార్లు ఆందోళనలు చేసినా .. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈనెల 17వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమ సభకు పెద్దఎత్తున భవన కార్మికులంతా హాజరుకావాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు ఐనపర్తి శ్రీనివాసరావు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహారం అవసరం



రోగులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న డాక్టర్ సుచందన

తాళ్లపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి బారినపడిన బాధితులు చికిత్సతో పాటు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, అలాగే కుటుంబసభ్యులతో ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలకపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా సోమవారం మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ బాధితులైన 20 మందికి పౌష్టికాహారం కిట్లను పంపిణీచేశారు. అనంతరం 100 మంది క్షయ బాధితులను దత్తత తీసుకున్న సర్వారాయ సుగర్ లిమిటెడ్ ప్రతినిధి హెచ్‌ఆర్ శ్రీధర్‌కి వైద్యసిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డా. సుచందన, సూపర్‌వైజర్ బీ.భీమరాజు, కో ఆర్డినేటర్ వర్మ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నానిబాబు నూతన నియామకం

దేవరపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గ హ్యూమన్ రైట్స్ కన్వీనర్‌గా లక్ష్మీపురానికి చెందిన పోలుమాటి నానిబాబు ఎంపికయ్యారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మానవ హక్కులపై బాధ్యతగా ఉంటూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ జీఅండ్‌పీ హ్యూమన్ రైట్స్ ఫౌండర్ జీ. మల్లిఖార్జున రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎస్ రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

దేవరపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ప్రభుత్వ ఉద్యోగులంతా ఆందోళన నిర్వహించారు. పాతవిధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 18 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డివిజనల్ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి మొత్తం 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు తమ సమస్యలను కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. నమోదైన ప్రతి ఫిర్యాదు యథార్థస్థితిగతులను తెలుసుకోవచ్చునన్నారు. దీనికి డివిజనల్, మండల, గ్రామస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

91 శాతం పింఛన్ల పంపిణీ

పెరవలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సోమవారం నాటికి 91 శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో కే. ఉమారాజ్యలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా పిట్లవేమవరంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

రాజమండ్రికి బీజేపీ శ్రేణులు

పెరవలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో జరిగిన బీజేపీ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. బీజేపీ నేతలు సింహాద్రి సత్యనారాయణ, పెన్మత్స సుబ్రహ్మణ్య వర్మ, రంగినీడి గంగాధరరావు, తదితరుల ఆధ్వర్యంలో బస్సులు, ఆటోలు, కార్లలో వెళ్లారు.

చంద్రబాబుకు సరిలేరు : ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి సోమవారంతో 30 ఏళ్లు పూర్తయ్యిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఈ సందర్భంగా గోపాలపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అనే పథకాన్ని పెట్టి దేశంలోనే సంచలనం సృష్టించారన్నారు. అప్పటి నుంచి ప్రజల భాగస్వామ్యంతో జన్మభూమి, డ్వాక్రా సంఘాలు, తదితర వాటికి అంకురార్పణ చేశారన్నారు. ప్రస్తుతం పేదలకు రూ.ఐదుకే నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు. అలాగే పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం పీ4 పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకుల్లో ఆయనకు ఎవరూ సాటిలేరన్నారు. ఈయనతోపాటు తదితర నేతలు ఉన్నారు.

'కూటమి ప్రభుత్వంలో కళలకు ప్రోత్సాహం'



గుమ్మడి గోపాలకృష్ణ

చాగల్లు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కళలను, కళాకారులను కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. సోమవారం చాగల్లులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నాటక, కళా రంగానికి నంది అవార్డులు, నాటికలకు ఉగాది పురస్కారాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తనకు ఈ పదవి దక్కినందుకుగాను ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి సోమవారంతో 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

మహా గణపతికి విశేష పూజలు



వినాయక మండపం వద్ద విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హీరో షోరూమ్‌కు ఎదురుగా ఉన్న వీధిలో జైగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మహా గణపతికి విశేష పూజలు నిర్వహించారు. ఈ ప్రాంత విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం యర్రా త్రిమూర్తులు ఆర్థిక సహకారంతో సుమారు 100 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైస్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

నల్లజర్ల, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైస్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని సివిల్ సప్లై ఏఎస్‌వో నాగాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ప్రకాశరావుపాలెం పెట్రోల్ బంకుపై వచ్చిన ఆరోపణను విచారించేందుకు విచ్చేసిన ఆయన రైస్ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. వీఆర్వో, రేషన్ డీలర్లతోపాటు ఇంటింటికీ వెళ్లి కార్డులను అందించారు. ఆయన వెంట సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఛలో విజయవాడకు తరలిన ఉద్యోగులు



ధర్నాకు బయలు దేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

తాళ్లపూడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహా ధర్నాకు ఉద్యోగులంతా ఏపీసీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లినట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. వెళ్లిన వారిలో బాలబాల శంకర్, లక్ష్మీపతి, రమాదేవి, ప్రసన్న కుమార్, మౌనిక, ప్రసన్నలక్ష్మి తదితరనేతలు, సభ్యులు ఉన్నారు.

నిండుగా ప్రవహిస్తున్న గోదావరి



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద నిండుగా ఉన్న నది

కొవ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టాలు నాల్గవరోజు నీట మునిగే ఉన్నాయి. ఎగువ నుంచి బారీగా వరద నీరు నదిలో చేరడంతో గోదావరి నెమ్మదిగా పెరుగుతుంది. నదీ పరివాహక ప్రాంతాలలతో ఉన్న వరద ప్రవాహం దిగువకు చేరుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతుంది. దీంతో మరికొన్ని రోజులు వరద ఉధృతి కొనసాగుతుందని తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలవనరులశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు వినాయక నిమజ్జనాలు జరుగుతున్నందున పోలీసులు గోదావరి వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటుచేశారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద క్రేన్‌ను ఏర్పాటుచేసి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేస్తున్నారు. ప్రజలు ఎవ్వరూ గోదావరిలో దిగకుండా చర్యలు చేపట్టారు.

ఘనంగా ఎల్ఐసీ 69వ అవతరణ దినోత్సవం



కమిషనర్ సందీప్‌ను సత్కరిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కొవ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ సంస్థ కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధీటుగా ప్రజలకు సేవలు అందిస్తోందని కొవ్వూరు ఎల్ఐసీ కార్యాలయ సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎన్. సూర్య శ్రీరామ్ అన్నారు. సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో 69వ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 69 సంవత్సరాలుగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎల్ఐసీ లీడర్‌గా ఉంటూ, నేటికీ పాలసీల సేకరణలో 65 శాతం వాటాను కలిగి ఉందన్నారు. గత ఏడాది రూ. 2.30 కోట్లు క్లెయిమ్‌లను పరిష్కరించి ప్రపంచంలోనే అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సందీప్‌ను శాలువా కప్పి సత్కరించారు. ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

• కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 159 అర్జీలు
• జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



అర్జీదారుడితో మాట్లాడుతున్న జేసీ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పలు సమస్యలపై 159 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీదారులుకు సంతృప్తి కలుగకపోవడం వల్లనే ఫిర్యాదులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. వీటి పై జిల్లా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. మొత్తం 159 అర్జీలలో 150 ఆఫ్‌లైన్‌లోను, 9 అర్జీలు ఆన్‌లైన్‌లోను స్వీకరించామన్నారు. వీటిలో రెవెన్యూ శాఖకు 93, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 75, పౌర సరఫరాల శాఖకు 43, పాఠశాల విద్యాశాఖకు 7, విద్యుత్ శాఖకు4 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అలాగే రవాణా శాఖకు, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలకు రెండేసి చొప్పున, మౌలిక సదుపాయాలు పెట్టుబడులు, సామాజిక సంక్షేమ, జలవనరులు, పర్యావరణం, అటవీ, సాంకేతికత, పరిశ్రమల, వాణిజ్య శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 28 అర్జీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 28 అర్జీలను స్వీకరించి తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు పంపించారు. చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ పాల్గొన్నారు.

కూటమి నేతల సంబరాలు

• చంద్రబాబు సీఎంగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి సోమవారంతో 30 ఏళ్లు



ఊనగట్లలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు , కూటమి నాయకులు

చాగల్లు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి సోమవారంతో 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఊనగట్ల సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, ధారవరంలో కూటమి నేతలు కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు హాజరై మాట్లాడుతూ చంద్రబాబు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన చేపట్టిన ఆర్థిక, రాజకీయ సంస్కరణలు రాష్ట్ర భవిష్యత్‌నే కాకుండా దేశ భవిష్యత్‌ను కూడా నిర్దేశించాయని కొనియాడారు. ఆయన ప్రారంభించిన జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, మహిళలకు దీపం పథకం, డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహం, ఐటీకి ప్రోత్సాహం, హైటెక్ సిటీ నిర్మాణం, లక్షా 80 వేల మంది ఉపాధ్యాయుల నియామకం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చాయన్నారు. అలాగే విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రియల్‌టైమ్ గవర్నెన్స్, దళితుల అభ్యున్నతి కోసం ఎస్సీ వర్గీకరణ, పేదరిక నిర్మూలన కోసం పీ4 వంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు.

పెన్షన్ల పంపిణీ

దీనిలో భాగంగా చాగల్లులో కూటమి నాయకులతో కలిసి పెన్షన్‌లు పంపిణీ చేశారు. అలాగే బ్రాహ్మణగూడెంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నేతలు కేతా సాహెబ్, కరుటూరి సతీష్, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, కారింకి సత్యనారాయణ, వీరవల్లి సత్యనారాయణ, మనెల్లి నాని, బొడ్డు కేశవ కుమార్, పాలకుర్తి శ్రీనివాస్, గారపాటి శ్రీనివాసరావు, దొమ్మేటి వేణు, పత్తిపాటి వెంకట సుబ్బారావు, దొంగ రామకృష్ణ పాల్గొన్నారు.

పట్టాలు దాటుతుండగా...

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల క్రితం కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని తిరిగి నెలరోజుల తరువాత ఆసుపత్రిలో డాక్టర్‌ను చూపించుకునేందుకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన సోమవారం నిడదవోలులో చోటు చేసుకుంది. వివరాలివి.. నల్లజర్ల మండలం తెలికిచర్లకి చెందిన రేకపల్లి సీతామహాలక్ష్మి (70) నెల క్రితం నిడదవోలు పట్టణంలోని ఓ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. తిరిగి సోమవారం వైద్యుడ్ని చూపించుకునేం దుకు నిడదవోలు వచ్చింది. ఈ క్రమంలో ఆర్వోబీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు బసివిరెడ్డిపేట శివాలయం వద్ద నిలిపివేస్తున్నారు. దీంతో అక్కడ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు అందరిలాగే ఆమె కూడా రైలు పట్టాలు దాటుతుండగా విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళుతున్న వందే భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు. మృతురాలికి భర్త, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దేవరపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ రామారావు

దేవరపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు దివ్యాంగుల పింఛన్లు కొన్నింటిని తీసివేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ మాటలను నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పింఛన్ దారులు చందన రవికుమార్, కాళీదాసు రంగారావు, షేక్ ఆషాబీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెరిగిందన్నారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. టీడీపీ నాయకులు నందిగం శ్రీధర్, జ్యేష్ఠ సత్యనారాయణ, పిన్నమనేని నవీన్, కవల సురేశ్, యలమాటి అక్కిరాజు, పోలుమాటి రామకృష్ణ, ఒరుగంటి జగదీశ్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో నిన్నటి వరకూ పెన్షన్ వస్తుందో రాదో అనుకున్న దివ్యాంగులకు ఎప్పటిలానే ఎటువంటి అభ్యంతరం లేకుండా పెన్షన్ పంపిణీ చేయడంతో వారంతా ఊపిరి తీసుకున్నారు. గత నెలలో అధికారులు పంపిన నోటీసులు, వైద్యాధికారులు చేసిన వైద్యపరీక్షలతో దివ్యాంగులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం 1వ తేదీన యథాతథంగా పెన్షన్ పంపిణీ కావడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

కొవ్వూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకామ్ జనరల్ అనే కొత్త కోర్సులు ప్రారంచామని కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రవేశపెట్టామన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. బీఏ హిస్టరీ, బీకామ్ కంప్యూటర్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రీ కోర్సులలో చేరుటకు ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నెంబర్లు 08813-297035, 9391037215 కు సంప్రదించవచ్చునన్నారు.